# ఈనాటి సమస్య

"ఆంటీ ఆంటీ...మరేమో...మరేమో..." అంటూ పనిగట్టుకుని తలుపుబాది బాది తీయించిన ఆ పిల్ల ఆత్రంగా ఏమో చెప్పాలనుకున్నా చెప్పలేకపోతోంది ఆవేశంలో. భుజాన సంచీ చేతిలో టిఫిన్ బాక్సూ, స్కూలు యూనిఫారంలో నేవుంది అప్పుడప్పుడే స్కూలునుంచి రొప్పుతూ, రోజుతూ వచ్చినట్లుంది ఆకారం.

కమల ప్రాణాలు ఎగిరిపోయినట్లయింది. "అదేమిటమ్మా? అప్పుడే వచ్చేశావేం స్కూలునుంచి? మా బాబూ ఏడీ?"

"మరేం, మరేం...బాబూ...స్కూల్లో అదెవరో..."

నాలుగేళ్ళ ఆ పిల్లకి ఏం జరిగిందో చెప్పటం చేత కావటంలేదు సరిగా బాబు ఈడుదే పక్క ఇంటివారి అమ్మాయి.

కమల గుండె అతివేగంగా కొట్టుకుంటోంది. 'భగవాన్' మా బాబుకు...ఏ ప్రమాదమూ జరగలేదు కదా! నువ్వే దిక్కు- వెంకటేశ్వరస్వామీ!' ఆ క్షణంలోనే ఆమె మనసు వెంకటేశ్వరుని పాదాలవరకూ పయనించి వచ్చింది. అనేక మొక్కులు మొక్క-సాగింది.

హోలోమని కేకలుపెడ్తూ పోతున్నారు అదేదారిన మరికొందరు. స్కూలు పిల్లలు ఒక్క- ఉదుటున పరుగెత్తి వాళ్ళని ఆపి అడిగింది కమల. "వెళ్ళిపోతున్నా రేం?"

ఉత్సాహం చిందులు త్రొక్కు-తుంది వాళ్ళనరనరం లోనూ, "స్కూలులేదు. హర్తాళ్!" ఎంతో సంతోషంగా అరిచారుకొందరు.

"స్కూళ్ళు తెరుస్తే మాష్టర్లని తంతారుట!" పదేళ్ళ పిల్లాడొకడు కళ్ళుత్రిప్పుతూ చెప్పాడు.

"కాదు, తగలబెట్టేస్తారు!". మరో సిసింద్రీ!

"భలే రాళ్ళువిసిరేటప్పటికి హెడ్‌మాష్టారు లోపలికి పరిగెత్తి తలుపేసుకున్నారు. కిటికీల గాజుతలుపులన్నీ భళ్ళున పగలగొట్టేశారు!" ఏడెనిమిదేళ్ళ పిల్లతలచుకు తలచుకు నవ్వుతోంది.

జరిగినదేమిటో చూచాయగా అర్థమైంది కమలకు. ఒక్క-సారిగా ఆమె గుండె ఆగినట్లయింది. 'అమ్మో! బాబు ఏమైనట్టు! పరిగెత్తి పారిపోవడంకూడారాదే వాడికి! ఈ పిల్లలంతా ఇలా బిలబిలా వచ్చేస్తుంటే వాడుమాత్రం వాళ్ళతో రావద్దూ! అక్క-డపం చేస్తున్నట్టూ! ఏరామో

రప్పో తగిలి ఏడుస్తున్నాడో—ఇంకేమైనా విపరీతం జరిగిందో! భగవంతుడా! పసిపిల్లల స్కూలుకుకూడా ఏమిటీ హర్తాళ్‌లూ విపరీతాలూ! అవేవో ఆ పెద్దాళ్ళుచేసుకోకూడదూ?'

రోడ్డుమీద నడిచిందో పరుగెత్తిందో ఆమెకే తెలియదు.

విరిగిన పగిలిన అద్దాలనూ కుర్చీలను ఏడుపుముఖాలతో చూచుకుంటున్నారు ప్రధానోపాధ్యాయుడూ, ఉపాధ్యాయులూ, తదితరులూ, దూరానకొందరు పిల్లలునిలబడి వినోదంగా చూస్తున్నారు. పరుగు పరుగునవాళ్ళ దగఱకు వెళ్ళి చూచింది. వారిలో శ్రీనులేడు. "మా బాబు .... శ్రీనివాస్ ఏడీ?" ఆత్రంగా అడిగింది. ఎవరూ చెప్పలేకపోయారు.

"చూడలే"దని ఒకరూ, "వెళ్ళిపోతుంటే చూశా"మని ఒకరూ అన్నారు.

"వస్తూ దారిలో ఎదురయ్యేవాడేకదా! ఏమైనట్లూ?" గుండెలలో రైళ్ళు పరుగెడ్తున్నాయి కమలకు.

లాభంలేదని తెల్సినా టీచర్స్ దగ్గఱకు వెళ్లి అడిగింది. "మా శ్రీనివాస్...ఇంటికి రాలేదు. ఎటు వెళ్ళాడో ఎవరైనా చూశారా?"

"పిల్లలతో కలిసే వెళ్తాడు. ఇంకెటు వెళ్తాడు? అందర్నీ ఒక్కసారేగా వదలిపెట్టేశాం?" ఒక టీచర్ అన్నది.

"వాడికి ఏమీ తెలియదు, ఎటూ పారిపోవాలనీ కూడా తెలియని వయస్సు. ఏమైనట్లు కంగారుగా స్కూలు

గ్రౌండంతా చుట్టివచ్చింది. కిటికీలలోనుంచి క్లాస్ రూమ్ లోనికి తొంగిచూచింది. పొరపాటున లోపల వుండగానే ఎవరైనా తలుపులు వేసేశారేమోనని. ఎక్కడా కన్పించక పోగా, మళ్ళీవచ్చి టీచర్సు దగ్గరే నిలబడింది.

“మహా నీకేవున్నాడా ఏమిటి కొడుకు? ఇంతమంది పిల్లలుండగా లేనిది మీవాడి కోసమే తహతహపడ్తున్నావ్!” అన్నట్లుగా చూశారు ఉపాధ్యాయులూ, ఉపాధ్యాయినులూ.

“ఫర్వాలేదు. ఈపాటికి ఇంటికి వెళ్ళేవుంటాడు ఇంకో దారిన వెళ్లి చూడండీ.” ఒకతను అన్నాడు.

ప్రతి తల్లీ తనపిల్లాడు చాలా అమాయకుడూ, గొప్ప వాడే అనుకుంటుంది. ఇదిగో – ఆ అమాయకులే ఇలా స్కూళ్ళూ ఊళ్ళూ ధ్వంసంచేసి మేష్టర్లని తంతున్నారు.” ఒక ఉపాధ్యాయిని అన్నమాటలకు వెళ్లిపోతూన్న కమల గిరుక్కున తిరిగి చూసింది.

లోలోపల చాలా ఆగ్రహం కలిగిందామెకు. “ఎవడో ఏదోచేస్తే మధ్యన నాకోసం పడి ఏడుస్తున్నావేమిటి నువ్వు? ఔనులే–పెళ్లీ, పిల్లలూ లేనిదానివి – నాబాధా, ఆత్రమూ నీకేం తెలుస్తాయి?” అనుకున్నది కసిగా.

చేసేదిలేక నీరసంగా ఇల్లు జేరేసరికి గేటులోనే నిలబడి చూస్తున్నాడు శీను.

“ఎక్కడి కెళ్లిపోయావురా బాబూ? నేను నీకోసం స్కూలికి వెళ్లొచ్చాను” ఆత్రంగా వాడితల నిమురుతూ,

బుగ్గలు సవరిస్తూ అడిగింది.

నాలుగడుగుల దూరంలో నిలబడ్డ స్త్రీ చెప్పింది. "స్కూలు వెనక చెట్టుక్రింద నిలబడి ఏడుస్తుంటే నేనలా పోతూ చూశానమ్మగారూ. మన బాబుగారని నాకు తెల్సు కదా! ఎత్తుకుని తీసుకొచ్చాను." స్కూలులో ఒక్కప్పుడు పనిచేసేది ఆమె. అడపా తడపా డబ్బులూ, మిఠాయిలూ దొరుకుతుంటాయామెకు కమలదగ్గఱ. అంచేత ఆమాత్రం విశ్వాసం కనపరచింది.

"మంచిపని చేశావు. లేకపోతే ఎటో వెళ్లిపోయి వుండేవాడు. అమ్మో ఎంతగండం తప్పింది ఇవాళ నాతండ్రికి!" అమాంతంగా ఎత్తుకుంది కమల.

"బాబుగారి పుస్తకాల పెట్టె ఏమైందోమరి! ఒక్కరే నిలబడి ఏడుస్తున్నారు. ఎంత అడిగినా చెప్పలేదు."

అప్పటికి జ్ఞాపకం వచ్చింది కమలకి పుస్తకాల విషయం. "ఏది బాబూ నీ పెట్టె?" లాలనగా అడిగింది.

"ఏమో?"

"ఎవళ్లో తీసేసుకున్నారో. క్లాస్‌రూంలో మర్చిపోయాడో! పోనీలే బిడ్డదక్కాడు. మళ్ళీ కొనుక్కోవచ్చు పుస్తకాలు. ఏ తప్పుడుదాకో పట్టుకుపోయాడంటే ఎవరి చేతుల్లో పడేవాడో."

"వెళ్ళనాండీ అమ్మగారూ?"

"అయ్యో వుండు. వట్టి చేతులతో ఎట్లా వెళ్తావ్" ౧రెండు రూపాయలూ, కాస్త మిఠాయి ఇచ్చిపంపింది.

"ఇల్లు భార్లాతీసి వెళ్ళిపోయావ్ ఆంటీ. అందుకని నేను కాపలా నుంచున్నానింతవరకూ. వెళ్తున్నానుమరి" ఎదురింటి వాళ్ళమ్మాయి చెప్పేసి వెళ్ళిపోయింది.

"బాగానేవుంది. ఇవ్వాళ పడ్డంత ఖంగారు ఎప్పుడూ పడలేదేమో నేను."

"ఏం, ఏంజరిగింది?" అంటూ రానేవచ్చాడు సుందర మూర్తి.

"మీరప్పుడే వచ్చారేమిటి? మీరూ హర్తాళేనా!

"నేను హర్తాళేమిటి - అర్థంలేని మాట!" నవ్వాడు సుందరం. హర్తాళ్ వాళ్ళ పుణ్యమాఅని హాయిగా ఇంట్లో కూర్చోవటానికొచ్చాను. వాళ్ళ దయవల్ల దారిలో ఎక్కడా నాకుగాని, జీప్ కూ, డ్రైవర్ కిగాని దెబ్బలూ, దేహశుద్ధి వగైరా మర్యాదలేం జరగలేదు."

అప్పటికి - అతడు మాట్లాడుతూనే తనను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తున్నట్లు గమనించిన కమల, తాను కూడ చూచుకొంది ఏమిటాఅని.

కాళ్ళకు ఇంట్లోవాడే రబ్బరు చెప్పులు; ఇంటి పను లతో నలిగిపోయిన చీరె. ఇంకాసంస్కరించిన కేశపాశం - బహుశః ముఖంకూడా జిడ్డోడుతూ వుండకపోయినా సుందరం చూపులనుబట్టి ఏదో వెలితి వున్నదనే అన్పిస్తూన్నది.

"ఇంతకూ తమరీ అవతారంతో ఎక్కడికి వెళ్ళి నట్లో?" సుందరం ప్రశ్నలో అపరిమితమైన హేళన.

కమల నోరు విప్పకముందే మళ్ళీ అన్నాడు. "పిల్లల్ని

కన్నాక అలంకరణమీద మోజు తగ్గుతుందంటే వొప్పు కుంటాను కానీ బొత్తిగా ఇలా పనిమనిషి అవతారంతో బయటికు రావటమెందుకని?"

వింటూనే ఉగ్రురాలై పోయింది కమల. "చాలిం చండి మీ విసుర్లూ, వెటకారాలూనూ. మీరే చెప్తు న్నారు కదా ఎవళ్ళు తంతారో రాళ్ళు విసుర్తారో అని భయ పడుతూ పరుగెత్తుకొచ్చానని! ఈపసివెధవ స్కూలునుం చెలా వచ్చాడు. వాడికేమైందీ అనడగరేం? పిల్లాడేమై పోయాడో అని పరుగెత్తే తల్లికి పనిమనిషిలాగుందో — పాకీ దానిలాగుందో చూచుకొని ముస్తాబయ్యేంత సావకాశం వుండదు"

"ఏం? నువ్వే పరుగెత్తడం దేనికి? ఇంట్లో మిగిలిన అందరూ చచ్చిపోయారా?"

"అనుకోవాలి మరి! తింటానికీ జీతాలు పట్టుకెళ్ళ టానికీ పదిమందున్నట్లు కన్పిస్తారు. ఇలాంటప్పుడు ఎవళ్ళూ కన్పించరు!"

ఆమె చాలా అసహనంగావున్నట్లు గమనించిన సుంద రం అప్పటికి తాత్కాలికంగా మౌనం వహించాడు.

"అయ్యగారూ... నేను... నేను...." జీప్ గారేజ్‌లో పెట్టివచ్చిన డ్రైవరు ఏదో అడగటానికి సందేహిస్తూ చేతులు నలుపుకుంటున్నాడు.

"ఏమిటి?"

"మా పిల్లవాడు స్కూలునుంచి వచ్చాడోలేదో సరిగాపోయి చూచుకురానా?"

"అలాగే వెళ్ళుమరి! తప్పేదేముంది?" డ్రైవర్ నిష్క్రమించాడు.

"ఏరా శ్రీనూ! ఏం జరిగింది మీస్కూల్లో?" కొడుకుని దగ్గఱగా తీసుకుని అడిగాడు సుందరం.

"చాలా...యింతమంది వచ్చేశారు మా స్కూల్లోకి" చేతులు దూరంగాచేసి చూపించాడు. 'ఏమి టేమిటో అరిచారు పెద్దగా డాడీ!'

"ఆఁ ఆఁ పెద్దగానే అరుస్తారులే. తర్వాత?"

"రాళ్ళు విసిరారు. కొన్ని కిటికీల అద్దాలవీ పగిలిపోయాయి. మమ్మల్ని బయటికి వచ్చేయమన్నారు. లేకపోతే తంతామన్నారు...మాకు చాలరోజుల వఱకూ సెలవులే... స్కూలుకొచ్చారంటే తంతామన్నారు. కొందరు టీచర్సు కూడా భయపడి పారిపోయారు"

"నువ్వేం చేశావ్?"

"ఏడిచాను"

"ఎందుకూ?"

"నా కోసం ఇంటికి తీసుకు రావటానికెవరూ రాలేదుగా? మరి నా పుస్తకాలు కూడాలేవు" శ్రీనుకళ్లు ధారాపాతంగా వర్షించసాగాయి.

"పర్వాలేదులే. ఏడవకు"

ఏం జరిగిందో తెల్సుకోవటానికి లోపలికి [illegible] ప్రజల [illegible] దోళన

సుందరమూర్తికి కమల కన్పించలేదు.

"కమలా!"

ఇంట్లో ఎక్కడావున్న అలికిడిలేదు. సమాధానం లేదు, అతడి కేకకు.

సర్వెంట్ క్వార్టర్స వైపు నడిచాడు.

అక్కడ కమల ఒక దృశ్యానికి కేవలం ప్రేక్షకురాలిలా నిలబడిపోయింది. పనిమనిషి గుండెలవిసేలా ఏడుస్తోంది, నెత్తీ నోరూ కొట్టుకుంటూ.

"ఏమిటటా?" సుందరం మెల్లగా భార్య నడిగాడు.

"దాని కొడుకు సినిమాహాలు దగ్గఱ పకోడీలవీ చేసి అమ్ముతాడు కదా?

"ఔనూ?"

"సినిమాహాలు మీద దాడిచేసిన మూక వాడిదగ్గర సరుకంతా తిన్నది తిని మిగిలినది మట్టిపాలు చేశారట. స్టౌ, పళ్లెం, జంగిడీ వగైరా అన్నీ ఏమయ్యాయో తెలియదు, విసిరేసి వుంటారు. పైగా వాడికి దెబ్బలుకూడా తగిలాయి గుడ్డలు చిరిగిపోయాయి. అదుగో లోపలపడుకున్నాడు. ఓ పాతిక రూపాయల నష్టమన్నమాట! మరి వాళ్ళ బ్రతుక్కి అదేమన్నా మాటలా ?"

సానుభూతిగా చూడడం మినహా ఎవరుచేయగలిగినది మాత్రమేమున్నది.

"శంకర్" పిలుస్తూ లోపలికి వెళ్ళాడు సుందరం.

చిరిగిన గుడ్డలతో, తలనిండా దుమ్ముతో, ఏడ్చిన చాలా దయనీయమైన స్థితిలోవుంది శంకర్ రూపం.

ఓ మూల ముడిచిపెట్టుకు పడుకున్నవాడల్లా లేచి నుంచున్నాడు. సుందరాన్ని చూచి, మళ్ళీ వాడి కళ్ళలో నీళ్లుబికాయి

"ఒరేయ్, ఏడ్చి ఏమిటిరా లాభం?" వాడి వీపు తట్టాడు సుందరం. "అలా ఏదైనా గొడవ జరుగుతూన్నప్పుడు ముందుగా అక్కడినుంచి పారిపోవటానికి ప్రయత్నించాలి, ఇంతకంటె మార్గంలేదు ఈ రోజుల్లో...సర్లే జరిగిందేదో జరిగిపోయింది. లే ఆగుడ్డలు మార్చుకో"

"జేబులోమూడు ఋపాయల చిల్లరవుంటే అవికూడా లాక్కున్నారయ్యగారూ, ఇక పెట్టుబడికూ్కడా ఏమీలేదు నాదగ్గఱ" భోరుమన్నాడు వాడు.

"ఫర్వాలేదులే, ఈ గొడవలు తగ్గనీ, నే నిస్తాను. నెమ్మదిగా తీర్చుకుందువుగాని."

వాడు చేతులెత్తి దణ్ణం పెట్టాడు.

"ఆలమ్మ కడుపుకాలా! మాలాటోళ్ల పేద కడుపులు కొట్టి ఏటి బావుకుంటారు? అనుభగిత్తారు యింతకింతా, మలమలా మాడిపోతారు. ఆళ్ల తల్లీ తండ్రులు సచ్చిపోనారా? ఆమాత్రం కుఱ్ఱోలని అదుపాలగ్నలో పెటుకోనేరా? దేశం మీద కొగ్గీసిన్రు! నాలాటోల ఏడుపు కొట్టకమానద్దా?..." నోటికొచ్చిన శాపనార్థాలన్నీ వదలుతోంది శంకర్ తల్లి.

"హుఁ వీళ్ళొక్కళ్ళ ఏడ్పులు మనం చూస్తున్నాం. అలాగెంతమంది ఎన్ని చోట్ల అలోమని ఏడుస్తున్నారో? వాళ్ళకి ఏదో కావలసివస్తే అధికార వర్గాలలో ఆందోళన తీసుకువచ్చి సాధించాలి కాని, ఇలా మామూలు ప్రజల

జీవన సరళికి ఆటకం కలిగించి బాధపడితే ఏమిటి ప్రయోజనం?" అనుకుంటూ భార్యాభర్తలు ఇంట్లోకి తిరిగివచ్చారు.

"హుఁ ఇంక యిదీవేళ పనిచేయదు." ఉస్సురనుకుంటూ గిన్నెలు తోమడానికి కూర్చుంది కమల.

"ఏడుస్తోందిపాపం! ఇలాటప్పుడు మనం మాత్రం ఏమనగలంలే!" సుందరం అన్నాడు.

ఛర్రుమన్నది కమల. "ఔనౌను. ఏమనగలం? ఆ సంగతి ఇప్పటికి తెలిసి వచ్చిందా? అందుకేగా మరి నేను వీధుల వెంట పరుగెత్తిందిపిల్లాడి కోసం!"

"అదిసరేలే కానీ......బొత్తిగా ఎలా వున్నావో తెలుసా నీరూపు రేఖా విలాసాదులు? ఎవరైనా చూస్తే మిసెస్ మూర్తి..." పూర్తిచేయటానికతడికి సాహసం లేకపోయింది.

"అయ్యోపాపం! మిసెస్ మూర్తిని ఎవరైనా ఈ అవతారంలో చూస్తే సుందరమూర్తి గారికి పరువు తక్కువై పోతుంది. పిల్లవాడు ఎటో పోయి తప్పిపోయినాసరే ఏమైనా సరే! మీకేం తెలుస్తుందిలెండి తల్లిబాధా ఆరాటమూను!"

"మరే, పాపం!" అతడిగొంతులో హేళన. "అసలు మీ ఆడవాళ్ళంతా ఇంతగా ఏమీచేతకాని వాజమ్మలై పోతారు. ఆమాత్రం ఇంటికి రాలేడూ? వీడీశోటి పిల్లలందర్ని తల్లులూ, తండ్రులూ నాకొర్లే వచ్చి తీసుకెళ్తున్నారా? సంచి భుజాన తగిలించుకుని మెల్ళ మెల్భా నడిచే వాళ్ళెందర్ని చూడటంలేదు నేను? వాడిని కొంచం మనిషిని పెంచినట్లు

పెంచు." కమలకెంత అగ్రహంకలిగిందో ఆనవాళ్ళువిని, ఆ కడుగుతూన్న గిన్నెలూ పళ్ళాలే చెబుతున్నాయి.

"ఆహా చూడకేం? ఇంకా చాలా మందిని చూస్తున్నాను నేనూను. రోడ్లు ప్రక్కనే బ్రతికేవాళ్ళనీ, పసి పిల్లలని చెట్టునీడన వడుకోబెట్టి కూలీ పనిచేసుకొనే ఆడవాళ్ళనీ, రాళ్ళు కొడ్తూ, కట్టెలుకొడ్తూ, బరువులు మోస్తూ గొడ్డుల్లా బ్రతుకుతూన్న మగవాళ్ళనీకూడా చూస్తున్నాను. అందరూ అలాగే బ్రతికితే ఇక కానిదేముంది?"

"సర్లే, సర్లే, నేను చెప్పేదేమిటంటే వాడిని కొంచెం మనిషిని పెంచినట్లు పెంచమనీ, జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులన్నా తట్టు కొనేట్లుంటాలి గానీ, ఎన్నాళ్ళు అమ్మ కొంగుమాటున దాక్కుంటాడు?" అంటూ ముందుగదిలో కెళ్ళిపోయాడు.

శ్రీను ఎమీతోచకుండా వున్నట్టు కుర్చీలు, సోఫాలు, సవరించుతున్నాడు.

"ఏరా, స్కూల్లోవుంటే ఈపాటికి ఏదోచదువుతూ వ్రాస్తూ వుండవలసిందేగా? ఆచదువేదో ఇంటి దగ్గరుండే చదువుకోకూడదా? తియ్యి పుస్తకాలు."

వాడు బిక్కముగం పెట్టుకు చూడటమేకానీ కదల్లేదు.

"ఏం చదువుకోవాలని లేదా ఇప్పుడూ?"

'లే' దన్నట్లుగా శ్రీను తలాడించాడు.

"ఔనులే, ఎందుకుంటుందీ? మిమ్మల్నిలా గాడిదల్లా తిరగమనేగా రోజు రోజూ ఈ గోలలన్నీ?"

"చాల్లేద్దూ, ఏమిటి వాడిమీద పట్టించారివాళ?" చేతులు తుడుచుకుంటూ వచ్చింది కమల. "ఇంతాచేసి ఒకటోక్లాసు, ఏమిటి చదవగలడు వాడింట్లో కూర్చుని?"

అందుకు సుందరం ప్రతిగా ఏమీ అనలేదు. పేపరు చేపబట్టుకూర్చున్నాడు.

"చూడమ్మా శ్రీనూ" కమల పిలిచింది, "ఆశంకర్‌ని ఓసారినాయర్ ఇంటికి వెళ్ళి చూసిరమ్మను, వాడేమయ్యాడో!"

"ఏం రాలేదా వాడివ్వాళ? సుందరం ప్రశ్న.

"రాలేదు. ఇంతవరకూ వస్తాడేమోనని చూస్తున్నాను. ఇల్లుదగ్గరేకదా! ఆమాత్రం ఏమైనా ఇబ్బందుంటే చెప్పి పోనక్కర్లేదూ? ఛీ ఛీ ఛీ ఒక్కడికి కూడా విశ్వాసం లేదు తినే ఇంటిమీద జీతాల కెగబడటమే కాని" విసుక్కుంటూ తిరిగి లోపలికి పోయింది.

అయిదు నిముషాల్లో రానేవచ్చాడు శంకర్ "ఇంట్లో లేడు, ఎక్కడికెళ్ళాడో తెలియదంటున్నారమ్మా ఇంట్లో వాళ్ళు."

"పోనీ ఓరోగం రొష్ఠూ వచ్చిందనేడవడమూ కాదు, ఎక్కడికో తగలడ్డాడా? వెదవదర్జాలు, ఇంతింతటి ఆఫీసర్లు హడిలిపోతూ వుంటారు అడుగడుగునా ఈ వంటవాళ్ళకీ పని వాళ్ళకీ మాత్రం ఎక్కడలేని సామంతాలు వచ్చాయి. ఇప్పుడు నేను మొదలు పెడితే ఎప్పటికౌతుందీవంట?" దుమ దుమలాడుతూ కూరలబుట్టా చాకూ ముందు పెట్టుకూర్చుంది.

"అందుకే వంటవాళ్ల మీద ఆదారపడనివాళ్లు అదృష్టవంతులు ఈ రోజుల్లో" సుందరం అన్నాడు. "కెనై హెల్ప్ యూ ఇనేవీ వె?" కొంటెగా అడిగాడు.

"ఉద్ధరిస్తారు! హెల్పూ, నా ముఖమూను!" కోపం విసుగూ ఎవరిపై చూపించాలో అర్థం కావడంలేదు కమలకి "అసలు మీవల్లే ఈ పనివాళ్లంతా ఇలా విధం చెడిపోయారు. పండక్కి డబ్బులు, సినిమాకి డబ్బులు, క్యాంపులకెళ్తే డబ్బులు, బట్టలు, 'ఊ' అంటే టిప్స్, 'ఆ' అంటే టిప్స్, ఇంకెందుకు పనిచేస్తారు వాళ్లు? నా ఒక్కతె చేతిమీద అధికారం నడిస్తే బాగానే వుండును."

నవ్వేశాడు సుందరం, "ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు, నామీదకే త్రిప్పావా నేరమంతా? ఈ చిటపటల్లో వేలు తెగ్గోసుకుంటావేమో! నేను కోసిస్తాగానీ నువ్వు మరో పని చూడు...అట్టే పనివాళ్లను విమర్శించావంటే మరో గంట కల్లా ఈ వార్త అలా అలా దావానలంలా ప్రాకి ఊళ్లో వున్న పనివాళ్ళ సంఘాలన్నీ వచ్చి మన గేటుముందు ధర్నా చెయ్యగలరు జాగ్రత్త"

"జరిగినా జరగవచ్చు ఈకాలంలో ఏం జరిగినా ఆశ్చర్యంలేదు."

"ఛ ఛ, లేనిపోని అవస్థ వచ్చిందిగదూ?" ఉల్లిపాయలు తరిగినందువల్ల వచ్చిన కన్నీళ్ళని తుడుచుకుంటూ, ముక్కెగబీలుస్తూ అన్నాడు సుందరం.

"పోనీ ఈ పూటకి క్యారియర్ తెచ్చుకుందామన్నా

ఆ దారిగూడా బంద్. పూరా హర్తాళ్ హర్తాళ్"

కమల మాట్లాడలేదు.

"లేకపోతే ఓ పనిచెయ్యనా!" సీరియస్‌గా అడిగాడు

"ఏమిటీ?"

"ఫ్రెండ్సందరికీ టెలిఫోన్స్ చేసి చూడనా ఎవడైనా మర్యాదకైనా భోజనానికి రమ్మని పిలవకపోతారా, రోజూ ఆపార్టీలూ, ఈ పార్టీలూ అని పిలుస్తారు కానీ, ఇలాంటి రోజున ఒక్కడుగూడా పిలవడేం."

కోపమంతా మరచిపోయి విరగబడి నవ్వింది కమల. "చాల్లెండి ఆమాత్రం ఓ పూట భోజనమే వండిపెట్టలేనంత చేతకాని దానను కాను."

"హమ్మయ్య రక్షించావ్. ఊరంతా దేశమంతా వ్యాపించివున్న అశాంతిని ఇంట్లోకిగూడా రప్పించావ్ కావు కోపంగా వున్నావ్, ఇవ్వాళ అన్నం పెడ్తావో లేదో నను కున్నాను."

"ఔనౌను, చాలాసార్లు మీచేత ఉపవాసాలు చేయి స్తున్నానుకదూ."

"అన్నట్లు శ్రీనూ ఏడీ?" భోజనాలు చేస్తూండగా మధ్యలో హఠాత్తుగా జ్ఞాపకంవచ్చి అడిగింది కమల.

"ఏమో చాలాసేపట్నుంచీ వాడి అలికిడే లేదుసుమా నిద్రపోతున్నాడేమో ననుకున్నాను నేను!" సుందరం కూడా ఆత్రత వ్యక్తపరచాడు.

ఎంగిలి చేతులతోనే ఇద్దరూ లేచి వెళ్ళారు. ఇంట్లో ఎక్కడా లేడు

"ఎక్కడికెళ్ళాడు?" ఇద్దరి నుంచీ ఒకే ప్రశ్న, ఇద్దరి కనులలోనూ ఒకే రకపు భయాందోళనలు.

"ఇక్కడవాళ్ళ పిల్లలతోనైనా ఆడుకుంటున్నాడేమో" సర్వెంట్ క్వార్టర్స్‌న వెనకనున్న ఖాళీ స్థలంవైపు నడిచారు.

అక్కడ శంకర్, అలాంటి వాళ్ళే అయిదారుగురు కూర్చుని పేకాడుతూ, కబుర్లు చెప్పుకుంటున్నారు. బయటి ప్రపంచమే మఱచిపోయినట్లుగా.

శంకర్ ఒడిలో కూర్చున్న శ్రీనివాస్ ఆ కబుర్లన్నీ శ్రద్ధగా వింటున్నాడు. రెప్ప వేయకుండా వాళ్ళనే చూస్తూ.

"ఒక్కొక్క రాయి విసిరేప్పటికి భళ్ళు భళ్ళున అద్దాలు ఏంపగిలాయిరా. వ్వారెవా!" ఒకడు చెప్తున్నాడు.

"అరే, ఆడు లేడూ ఆ మిఠాయి కొట్టోడూ... మేమందరం మిఠాయిలు తినేస్తుంటే ఏం ఏడిశాడురా లబోదిబో మని గుండెలు కొట్టుకుని!" ఇంకొకడు తెల్బుకు తెల్బుకు నవ్వుతున్నాడు.

"మాంబాగ అవుతున్నాదిలే ఒక్కొక్కడికీ." ఆ తర్వాత కొన్ని వినరాని భూషణ పరంపరలు. "ఒక్కొక్కడు మేలకి మేలూ సంపాదించి, మేడమీద మేడ కడతన్నాడు. బాగా శాస్తి ఔతున్నది. ఒక్కొక్కడికి. ఆడిని బయకీడ్చి కారు తగల బెడ్తాంటే, ఎనక్కి తిరిగి సూడకుండా పరుగెట్టాడు నిన్నొకక ఆఫీసరు బాబు."

"నాసామిరంగా ఈ హర్తాల్ సల్లగుండ! రోజూడబ్బే

కదా! ఏనాడైనా యింత డబ్బు కళ్ళచూశామా ఎంత కష్టం పడితే మాత్రం! మంచి ఔర్లీను గుడ్డలు కుట్టించుకుంటాను. ఓ సైకిలు కూడా కొనుక్కుంటాను.

జేబులో రూపాయలు తీసి లెఖ్ఖపెట్టుకుంటున్నాడొకడు.

"తీసుకురండి శ్రీనును!" కమల గబగబా లోపలికి వెళ్ళిపోయింది.

"ఒరేయ్ శ్రీనూ!"

సుందరం రెండుసార్లు పిలిస్తే తప్ప ఆబృందంలో ఎవరికీ బాహ్య ప్రపంచపు జ్ఞానం రాలేదు.

"అయ్యగారు!" అంటూ గాభరాగా లేచి నిలబడ్డాడు శంకర్. మిగత వాళ్ళు ఖంగారు పడ్తూ డబ్బులు జేబుల్లో కుక్కుకుని పేకముక్కలు దాచేశారు.

"శంకర్ బాబునిటు తీసుకురా!"

అతడి వదనంలో కోపాన్ని పసి గట్టిన శంకర్ శ్రీనూనెత్తుకొని లోపలికి అనుసరించాడు.

"ఎందుకురా బాబు నక్కడికి తీసుకెళ్ళావ్"? కోపంగా అడిగింది. కమల సుందరం చూస్తున్నాడు మౌనంగా.

"నేనెందుకు తీసుకెళ్తానండీ? అబ్బాయిగారే వచ్చారు అటుగా." అనేసి వెళ్ళిపోయాడు శంకర్.

భార్యాభర్తలిరువురూ ఆశ్చర్యంగా ముఖ ముఖాలు చూచుకున్నారు.

వాడి స్వరంలో, తీరులో, నడకలో ఆదిలోవున్న వినయం మటుమాయమై ఏదో నిర్లక్ష్యం, పెడసరితనంకొట్టవచ్చినట్టు కన్పిస్తున్నాయి!

"ఎందుకెళ్ళావురా అక్కడికి? ఎప్పుడైనా వెళ్తావా?" కొడుకును దబదబా బాదుతున్న కమలను అడ్డుకొని శ్రీనివాస్‌ను ఎత్తుకున్నాడు సుందరం.

"మతిపోయిందేమిటి? ఏమిటి లాభం వాడిని కొట్టుకొని? వాడికేం తెలుసు ఎక్కడికి వెళ్ళాలో ఎక్కడికి వెళ్ళకూడదో!"

"అందుకే రెండు అంటిస్తే బాగా జ్ఞాపకముంటుంది."

"ఏమీ వుండదు. మరింత బండబారి పోతాడు. ఓ స్కూలూ లేదూ, చదువు లేదూ. కాలక్షేపం కోసం అటూ యిటూ పోతున్నాడు."

"అలా పోయి పోయి, ఆ వినరాని విషయాలన్నీ వింటూ గాడిదలా తయారౌతాడు!"

"కానీ! ఏం చేస్తాం? అన్ని గాడిదల్లో ఇదీ ఓ గాడిద. పరిస్థితుల కెదురీదలేం కదా!"

ఇంకా వెక్కుతూన్న శ్రీనివాస్‌ను వీపునిమురుతూ బయటకు తీసుకుపోయాడు.

వీధీవరండాలో నిలబడి వచ్చేపోయేజనాన్ని చూస్తుంటే శ్రీనివాస్ ఏడుపును మర్చిపోయాడు.

ప్రక్కింటివాళ్ళ పుత్రరత్నం రామన్ చాలా బిజీగా వున్నట్లు కన్పిస్తున్నాడు—ఎక్కడినుంచో హడావుడిగా పదిమంది కుర్రాళ్ళను వెంట బెట్టుకుని, ఓ పావుగంట వున్నారు ఇంట్లో. మళ్ళీ వచ్చినంత హడావుడిగానూ వెళ్ళిపోయారు సైకిళ్ళూ, స్కూటర్లూ ఎక్కి, టైట్ పాంట్, గాడీగా వున్న బొమ్మలషర్టు, కళ్ళకు రంగద్దాలు, మొహంమీదికీ, మెడ

మీదికి దిగ్గారిపోతూన్న జుట్టు — ఇదీ రామన్ ఆకారం, ఆ ఆకార విశేషాదుల్ని గురించి ఆలోచనలో పడ్డాడు సుందరం క్రిత సంవత్సరం వఱకూ 'ఒళ్ళు కప్పుకోవడానికి ఏదో ఓ గుడ్డవుంటేచాలు, కడుపు నిండితే చాలు' అన్నట్లుగా వుండేది రామన్ కుటుంబం. అతడి తండ్రి గోపాలం ఓ మాదిరి కాఫీహోటల్ నడుపుతుండేవాడు. అటువంటి గోపాలం ఆరు నెల్లనాడు ఒక్కసారిగా బజార్లో మంచి సెంటరులో ఓ అందమైన బిల్డింగ్ కట్టేసి అందులో పెద్దస్థాయి హోటల్ నడుపుతున్నాడు; కట్టుగుడ్డలు, ఆకారాలు మారిపోయినట్టే వుండే మామూలు పెంకుటిల్లు కూడా అందమైన మేడగా మారి పోయింది. ఈ మధ్య ఓ కారు కూడా వెలిసింది. ఆ యేడే కాలేజీలో జేరిన రామన్‌కు ఓ స్కూటర్ ఏర్పడింది. స్టూడెంటు లీడరుగా ఎన్నికయ్యాడు--ఆ ఎన్నికలలో ముప్పై వేలు ఖర్చుపెట్టాడని వదంతి. ఇందంతా ఏమిటో చిదంబర రహస్యం. ఓ వంకన ఎందరో తిండిలేక, పిల్లలకు కనీసపు చదువైనా చెప్పించలేక కనీసావసరాలైనా తీర్చలేకుండా వుంటే మరో వంకన కొందరివద్ద డబ్బు ఇలానీళ్ళలా ఎలా ప్రవహిస్తుందో సామాన్యులు అర్థం చేసుకోలేని విషయం. అదివఱలో సుందరంవంటి వారి ఇళ్ళలో చిన్నచిన్న శుభ కార్యాలకూ, అప్పడాలూ, ఊరగాయలూ వగైరా పనులలో సాయానికి వచ్చి పదీ పఱకా పట్టుకు పోతూండే గోపాలం భార్య ఇప్పుడసలు మేడదిగదు. ఎప్పుడూ జరీచీరలే కాని కట్టదు. అప్పుడప్పుడు ఊళ్ళోని పెద్దపెద్ద రాజకీయ వేత్తలూ, సంఘ సంస్కర్తలూ వంటి మహానుభావుల

ఇళ్ళకూ, ఘరానా మహిళల సమావేశాలకూ మాత్రమే కార్లో వెళ్తుంటుంది! ఇప్పుడు గోపాలం అనేక కమిటీలలో గౌరవసభ్యుడు, కొన్ని సంఘాలకు గౌరవాధ్యక్షుడు కూడా!

గోపాలం నలుగురు పెద్ద మనుషులతో వచ్చి కారు దిగి లోనికి వెళ్ళాడు.

"రోడ్లమీద ఎవరి వాహనాలు కన్పించినా నాశనం చేసేస్తారట ఈ హర్తాళ్ సమయంలో. మరి వీళ్ళ కార్లు స్కూటర్లూ ఇంత స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నాయీ?"

అప్పుడే పని ముగించుకు బయటకు వచ్చిన కమల ఆరాగా అడిగింది భర్తను.

నవ్వాడు సుందరం. "ఇవన్నీ మనకు అర్థంకాని అద్భుతాలు!"

"అలాగేవుంది మరి......అదెవరూ ఆ ఎదురింట్లోంచి వచ్చే పిల్ల--లక్ష్మికాదూ? మన నాయర్ చెల్లెలు!"

"ఔను పిలవండి."

ఎంత బిగ్గఱగా పిలిచినా విన్పించనట్టే పారిపోయింది.

"ఏం పోయేకాలమో -- నాలుగు రోజులైంది వాడు పనిలోకివచ్చి. కనీసం -- 'ఈ కారణంగా రావటంలేదూ' అని చెప్పి మానేసినా బాగుండును! ఏం తక్కువ చేశామనీ వాడికీ?"

మాట్లాడవలసిందేమీలేదు గనుక సుందరం మాట్లాడలేదు.

"రత్నం!" డ్రైవర్ని పిలిచింది కమల. "మన నాయర్ ఇంటికెళ్ళి, వాడినో, వాడు లేకపోతే వాడి భార్యనో పిల్చు

కురా. ఎందుకు రావటంలేదో గట్టిగా కనుక్కో. వదలి పెట్టకు.”

“ఎందుకూ రానివాడిని పట్టుకు ప్రాకులాడటం?” విసుక్కున్నాడు సుందరం. “మరెవళ్ళో దొరక్కపోరులే, కొన్నాళ్ళు అవస్థపడుమరి! ఏంచేస్తాం?”

“ఏమైనా జీతం ఎక్కువ చేయమనేమో! అడగలేక ఇంట్లో కూర్చుంటున్నాడేమో? ఎవడో క్రొత్తవాడిని తెచ్చి అన్నీ నేర్పేకంటే వీడికే మరో ఐదో పదో ఇస్తే పోతుంది. అవసరం మనది. వెళ్ళనివ్వండి, వెళ్ళు రత్నం.”

ఓ అరగంట తర్వాత తిరిగివచ్చాడు రత్నం ఒంటరిగా.

“నాయక్ యింట్లోనే వున్నాడమ్మగారూ. ఏమిటో పెడసరంగా చెప్తున్నాడు జవాబులు. వాడింక పన్లోకి రాడట.”

“ఎందుకట?”

“కారణం చెప్పడు. చాలా మంచి బట్టలు వేసుకొని బూటు వేసుకొని పెద్ద ఆఫీసర్‌లాగా తయారయ్యాడు. వాడికెక్కడ్నుంచైనా ఏమైనా డబ్బు వచ్చిందేమోనని నా అనుమానం. మహా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు, అమ్మగారూ, మనం మరొకణ్ని చూసుకోవాలి.”

“ఇక అదెలాగూ తప్పదులే. వీడికెందుకింత తలతిరుగుడొచ్చిందో అర్థం కావటంలేదు! జీతం కాక ఎన్నో ముట్టజెప్తున్నాను కూడాను!”

“అందుకే వాడికి తినితిని చేదైంది!” అన్నాడు

మూర్తి.

"అమ్మగారూ, నామాటేమిటంటే......" డ్రైవర్ రత్నం ఏదో చెప్పబోయి మళ్ళీ సందేహంగా చూచాడు సుందరం దెస.

"ఊఁ. ఏమిటి చెప్పు? అసహనంగా అన్నాడు సుందరం. "పనిమనిషి మానేసింది; వంటవాడు మానేశాడు. నువ్వుకూడా మానేస్తావా?"

"అయ్యయ్యో, ఎంతమాట బాబుగారూ?"

"మరి?"

"మన నాయన్... ప్రక్కింటి స్టూడెంటు రామన్‌తో మాట్లాడటం రెండుమూడుసార్లు చూశాను. ఒకవేళ వాళ్ళింట్లోనో హోటల్లోనో కుదుర్తున్నాడేమో?"

"కావచ్చు......పని చెయ్యనప్పుడు ఇంకా మనింట్లో ఎందుకు. దాన్ని ఆ క్వార్టర్ ఖాళీచెయ్యమను." కోపంగా అన్నాడు సుందరం.

కమల సందేహంగా చూసింది. "అది పని చెయ్యనని అనడంలేదు. ఒంట్లో బాగుండలేదు. రెండ్రోజులు పోయాక వస్తానంటోంది పన్లోకి. మరి నిజమెంతో ఆదేవుడికే తెలియాలి!"

అంతలో దబదబా చప్పుళ్ళూ, కేకలూ పెద్దగొడవ వినరావడంతో అందరూ ఏమిటోనని బయటకు పరుగెత్తారు. తిరిగి అంత ఖంగారుగానూ లోనికివచ్చి గుమ్మాల తలుపులూ, కిటికీల తలుపులూ అన్నీ మూసుకున్నారు. కమల భయంతో బిగుసుకుపోతూ శ్రీనివాస్‌ను ఒళ్ళోకి తీసుకుంది.

ఇంతకూ కారణం— ఇంటెదుటవున్న సినిమాహాలును ధ్వంసం చేస్తున్నారు, వందలాదిమంది. రాళ్లు విసుర్తున్నారు, అరుస్తున్నారు.

"అయ్యారూ...జీప్!" వణికిపోతున్నాడు డ్రైవర్.

"కానీయ్, ఏంచేస్తాం. నాలుగురాళ్ళు విసిర్తే ఫర్వాలేదు. తగలబెట్టేసినా మనం చేయగలిగిందిలేదు. నిన్న మరో కంపెనీవాళ్ల జీపులు రెండూ, ఒక వానూ తగలబెట్టేశారట." నిస్పృహగా అన్నాడు సుందరం.

"మీ జీప్ సంగతి దేవుడెరుగు. కంపెనీ ఎన్నైనా జీప్‌లూ కార్లూ అమర్చుకోగలదు. ఆ చేత్తోనే మన యింటిమీదకూడా రాళ్లు రువ్వి నానాకూతలూ కూస్తే ఏమిటి గతి? అప్రతిష్ఠకూడానూ." కమల అన్నది భయంగా.

"ఏం చేస్తాం? కానున్నది కాకమానదు." సుందరం సమాధానం.

"ఛస్తున్నాను మీ వేదాంతంతో." కమల విసుక్కుంది. "ఈ సినిమాహాలుదగ్గర ఇల్లువద్దు, మార్చిపారేద్దామంటే మీరు వినరు. ఇలాంటి అల్లర్లువస్తే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకూర్చోవలసిందే కదూ!"

"ఫర్వాలేదులే. అక్కడే ఎక్కువ రక్షణ కూడా వుంటుంది. టాకీస్‌వాళ్ళు క్షణాలలో పోలీసుల్ని రప్పించరూ?"

సుందరమూర్తి అన్నట్లే అయ్యింది. అయితే అల్లరిమూక పోలీసులపైకూడా రాళ్ళు రువ్వడం, పోలీసులు కొలదిగా భయపడ్తూ భయపడ్తూ లాఠీలు ప్రయోగించడం తంతు ముగిశాక ప్రశాంతత ఏర్పడింది.

కొద్దికొద్దిగా కిటికీ తలుపులు తీసి తొంగితొంగి చూస్తున్నాడు డ్రైవర్.

"చూడుబాబూ. అందర్నీ పోలీసులెట్లా లాక్కుపోతున్నారో! తాను చూస్తున్న దృశ్యపు తాలూకు ఉత్సాహాన్ని అమ్మగారికి అయ్యగారికీ పంచడాని కెటూ వీల్లేదు గనుక శ్రీనివాస్‌ను పిల్చి చూపెడుతున్నాడు రత్నం.

కుతూహలంగా చూస్తున్న కుమారుణ్ని చూచి కలవరపడింది కమల.

"ఛ. పిల్లలికి అటువంటివి చూపెట్టకూడదు. భయపడ్తారు. "శ్రీనును వెనక్కు లాగుతూ కిటికీ మూసి రత్నాన్ని కూడా మందలించింది. "ఆట్టే చూశావంటే ఈ కిటికీ తలుపులూ బ్రద్దలౌతాయి; నీ ముఖంమీదా నాల్గురాళ్లు పడతాయి."

నవ్వేశాడు మూర్తి. "ఛ. మరీ ఆడపిల్లంత అర్భకుణ్ణి చేయకు కొడుకుని ప్రేమతో. వాడిని మగవాడిని లాగే పెంచు."

"అలాగ పదిసార్లు వాడి ఎదుటే అనకండి. ఇహ నామాటేం వింటాడు? అమ్మకు వట్టిభయం. నేను హీరో నవ్వాలనుకుంటాడు. నేను వద్దన్న ప్రతిపనీ చేయడం మొదలు పెడుతాడు."

"ఛఛ. వాడిని నీకు ఎదురు త్రిప్పడం నా అభిమతం కాదు కానీ— నువ్వూ చదువుకున్న దానివేకదా— బుద్ధుడి చరిత్రచూడు - లోకంలోని చెడు ఏమీ బొత్తిగా తెలియకుండా పెంచిపెంచి, ఒక్కసారి వాడికన్నీ తెలిసేసరికి

అయోమయమైపోతాడు. గాలి దుమారాలకూ, పెనుతుఫానులకూ తట్టుకుంటూ పెరగాలి మొక్క, అప్పుడే నలువైపులకూ వేళ్ళూని దిట్టమైన వృక్షమౌతుంది. అలాగే కష్టసుఖాలను సమంగా ఓర్చుకుంటూ ప్రతికేమానవుడికి మానసిక బలం వృద్ధయి గుండె దిట్టవు ఏర్పడుతుంది. అలా కాదంటావూ—అదిగో ఆ గోలేలలో పెంచుతున్నావుగా పూల మొక్కల్ని? వాటికీ నీ కొడుక్కీ ఏమీ తేడావుండదు, ఆపైన నీ ఇష్టం."

అతడి మాటల గురించే లోలోన తర్క వితర్కాలు జరుపుకొంటూన్న కమల పైకి ఏమీ మాట్లాడలేదు.

ఓ గంట పోయాక, "మమ్మీ. వాళ్ళెందుకలా అల్లరి చేస్తున్నారూ?" అని తన దగ్గరకు వచ్చి ఆరాగా అతి కుతూహలంగా అడుగుతూన్న శ్రీనివాస్‌ను చూచి కమల మనస్సు ఉలికిపాటు జెందింది.

"ఇంకా వీడి బుర్రలో ఆ సంగతులే మెదుల్తున్నాయా?"

పైకిమాత్రం ప్రకాశంగా అన్నది. "నీకెందుకు చిన్నపిల్లాడివి, ఆ గొడవలన్నీ నీకు అర్థంకావు."

"అర్థమౌతుంది, చెప్పమ్మా."

వదలకుండా అడుగుతూన్న కొడుకు దెస విస్మయంగా చూచింది. ఏదో ఒకటి చెప్పి వాడి బుర్రలోని సందేహాన్ని సంతృప్తి పరచక తప్పదు, కాని, ఏం చెప్పాలి?

"ఏంలేదు. వాళ్ళు అల్లరివాళ్ళు. ఏంతోచక అటువంటి చెడ్డపనులు చేస్తుంటారు. అందుకేగా పోలీసులు పట్టుకు

పోయారు వాళ్ళనీ?"

"వాళ్ళు చెడ్డవాళ్లు కాదుమమ్మీ. మంచిమంచి బట్టలవీ వేసుకున్నారుగా?"

కమలకు విసుగు జనించింది. "మంచిబట్ట వేసుకున్న వాళ్ళంతా మంచివాళ్లు కాదు కానీ, నోరుమూసుకుని ఆపలక తీసి రాసుకో ఏమైనా. వెధవ ప్రశ్న వెయ్యకు."

బిత్తరపోయిన శ్రీనివాస్ కొద్దినిమిషాలు అక్కడే తచ్చాడి, ఏం అడకలేక వెళ్ళిపోయాడు. మరో పావుగంట కల్లా తిరిగి వచ్చాడు తల్లి దగ్గరకు ఉత్సాహంగా. నీకేం తెలి యదు మమ్మీ డాడీ చెప్పారు. వాళ్ళకేదో కావాలటగా? అందుకని అలా అల్లరి చేస్తున్నారట!" అన్నాడు.

మహా గొప్పవిషయమేదో కనిపెట్టిన మేధావిలా నిల బడిన వాడినీ మెరిసిపోతూన్న వాడి చూపులనూ దిగ్భ్రమతో చూడడమే కానీ ఏమీ మాట్లాడలేకపోయింది కమల.

"నిన్ను చదువుకోమని చెప్పలేదూ నేను?" అన్నది ఆఖరుకు.

"ఏం చదువు మమ్మీ? స్కూలు లేదుగా?"అంటూనే ఆటల్లో పడిపోయాడు శ్రీనూ.

నాలుగేళ్ళ పుత్రుని నోటినుండి ఈనాడే— ఈక్షణం లోనే ఇటువంటి క్రొత్త సమాధానం ప్రప్రథమంగా విన్న కమల మెదడులో అనేక ఆలోచనలు! ఎన్నో భయాలు!

# 3

"నమస్కారం."

"నమస్కారం. రండి." చిరుదరహాసంతో ఆహ్వానించింది కమల అతిథులను.

"ఏం, క్రొత్త వంటవాడు దొరికాడా ఏమిటి, మమ్మల్ని ఇంత ఆర్భాటంగా ఆహ్వానించారు భోజనాలకి?" కమలను హాస్యంగా అడుగుతూ ఆశీనుడయ్యాడు అసిస్టెంటు పోలీస్ సూపర్నెంట్ ప్రభాకర్.

"వంట వాళ్ళకోసం మన పద్ధతులెలా మానుకొంటాం చెప్పండీ? ఎలాగోలాగు జరిగిపోవల్సిందేగా?" కమల సమాధానం.

"నీ ఓపికకి నిజంగా మెచ్చుకోవలసిందే. నేనైతే-ఛస్తే ఇలాంటి ఏర్పాట్లు చేయలేను. వంటవాడు లేకుండా ఏడెనిమండుగురు అతిథులకు భోజనాలే? హమ్మయ్యో, నాతరం కాదు." అన్నది మిసెస్ ప్రభాకర్.

"ఏం ఏమైంది మీ నాయర్‌కి?" అయినా నీకెలా తెలుసోయ్ ప్రభాకర్, మావాడు స్వస్తి పలికినట్లు?" అనడిగాడు మళ్ళీ, నవ్వాడు ప్రభాకర్, "పోలీసువాళ్ళం. ఆ మాత్రం దివ్యదృష్టిలేనిదే ఎలా నెగ్గుకొస్తాం?" అన్నాడు తమాషాగా తలెగరేస్తూ.

"పోదూ, సస్పెన్సూ నువ్వూను. కొంపదీసి మీఇంట్లో

కాని కుదిరాడావేమిటి?"

అందరూ నవ్వేశారు.

"మాఇంట్లో కాదు మహానుభావా, మా అతిథి గృహంలో!" అన్నాడు ప్రభాకర్ తాపీగా.

అతడెంత నెమ్మదిగా చెప్పినా, అందలి పదునూ విశేషం అందర్నీ చకితుల్ని చేశాయి.

"వ్హాట్!" అన్నారు ఒకేసారి మూడు నాలుగు గొంతులు.

డైనింగ్ టేబుల్‌పై అన్నీ అమర్చుతూన్న కమల, చేతిలోపని వదిలి విస్మయంగా చూడసాగింది.

"ఏమన్నావ్?" మూర్తి రెట్టించాడు.

"మా అతిథులలో ఒకడయ్యాడు మీ నాయర్ అంటున్నాను. అర్థంకాలే?" అలాగే తాపీగా అడిగాడు ప్రభాకర్.

"ఎందుకూ? ఏం చేశాడు? వివరంగా చెప్పవోయ్ చంపక."

"మీ దగ్గరెందుకు మానేశాడు? ముందు అది చెప్పనాకు." ఎదురు ప్రశ్నించాడు ప్రభాకర్.

"అది తెలియకేగా మా అవస్థ? చెయ్యకుండా మానేశాడు."

"అంటే రెండు చేతులా తినటాని కెక్కడో బాగా దొరుకుతోందన్న మాటేగా?"

"ఏమోమరి!"

"మొన్న ఒక ప్రయాణీకుల బస్సును ఆపి నిప్పంటించారు కొంతమంది. అక్కడికి మేం వెళ్ళటం, మా డ్యూటీని కొద్దిగా నిర్వర్తించటం జరిగింది."

"నాకు తెలీకడుగుతానూ... డ్యూటీ కొద్దిగా నిర్వర్తించటం ఏమిటి ప్రభాకర్? పూర్తిగా మీ ప్రతాపం చూపించితే మళ్ళీ ఇలాంటి అల్లర్లు తలెత్తవ్ కదా!" అతిథులలో ఒక ఇంజనీర్ అడిగాడు.

"ఇవి అలా చూపించే రోజులు కాదండీ బాబూ! లాఠీ ఎత్తితే చాలు— అలా ఎందుకు చేయవలసి వచ్చిందో వెయ్యి సంజాయిషీలు చెప్పుకోవాలి. అల్లరి చేసేవాళ్ళని ఊరికే భయపెట్టి వదిలేయాలి కానీ, సీరియస్ యాక్షన్ తీసుకుంటే గొడవలు మరింత ఉధృతమౌతాయి గనుక చాలా జాగ్రత్తగా మసలుకోవాలని మాకు ముందే వార్నింగ్స్ వుంటున్నాయి. కలెక్టర్ గారి ఆర్డర్సు అయ్యేవరకూ ఫైరింగ్ జరగరాదు. ఫలితం ఏమిటంటే— మా చేతుల్లో తుపాకీలూ, పిస్టలూ్స, వగైరా బందోబస్తు అంతా వుండికూడా ఆ సినిమాహాలూ్స, బస్సులూ, రైళ్ళతోపాటు మమ్మల్ని కూడా తగలబెట్టేస్తున్నా నిలబెట్టి తంతూవున్నా అలాగే నిస్సహాయంగా నిలబడాలి. ఈ వివరాలన్నీ ఈ గొడవలు చేసేవాళ్ళకు బాగా తెల్సుగనుకనే పోలీసులంటే భయంలేకుండా ఇంతిదిగా ప్రవర్తిస్తున్నారు.

మరైతే మీ విధులేమిటి ఇక? మీరు చెయ్యాల్సినదేమిటి?"

"గుళ్ళో ఉత్సవ విగ్రహాలుండవూ. అంతే......

మీలాంటివాళ్ళంతా ఇళ్ళల్లో తలుపు వేసుకూర్చుంటారు గనుక మేము వెళ్ళి ఆయా కర్మకాండలకు ప్రేక్షకులుగా నిలబడి, నాలుగుదెబ్బలు తగిలించుకొని రావాలి అంతే."

"చూడగా ఈ రోజుల్లో పోలీసువారిది చాలా దయనీయమైన స్థితైపోయిందనుకుంటానే!" ఒకరి కామెంటు.

"తప్పకుండానూ. ఇంకా మెల్లిగా అంటున్నారా? ఇవ్వాళ ఫలానాచోట గొడవ జరుగుతుంది ఫలానా సినిమాహాలు మీద - లేదా షాపులమీద - లేదా రైల్వే స్టేషనుపై దాడి జరుగుతుంది. మీరు నామకార్థం వెళ్ళడమే కాని జోక్యం గలిగించుకోరాదు. కారణమేమంటే ఆ అల్లరి చేసేవాళ్ళలో మాకు కావలసిన వాళ్ళు - అనగా కొడుకునో మేనల్లుళ్ళో మరేదగ్గరవాళ్లో నన్నమాట - వున్నారు! అంటూ హై సర్కిల్స్‌లో వాళ్ళనుంచే మాకు కబురొస్తుంది. కబురేమిటి - ఒక విధంగా ఆజ్ఞ అనుకోండి. ఆ ఆజ్ఞ వుల్లంఘించిన ఏ ఆఫీసరూ రెండుమూడు నెలలుదాటి జీవించడు. ఏజీప్ యాక్సిడెంటో - హార్ట్ ఎట్టాకో - ఏదో ఓకారణం వుంటుంది పబ్లిక్‌కు అనుమానం రాకుండా."

"నిజమే. పాపం. ఈ విషయంలో ఏదైనా మార్పు జరగాల్సిందే!"

"ఏమో?" నిస్పృహగా అన్నాడు ప్రభాకర్. అటువంటి మార్పు జరిగే ఆశాకిరణం కనుచూపు మేరలో ఎక్కడా కన్పించటంలేదు. నాయకులే చేయించుతోంటే ఇక ఏదీగతి?"

"ఏ ఆధారంతో అంటున్నారు మీరు ఆమాట?"

ఒకరి సవాలు.

జవాబుగా చురుకుగా చూచాడు ప్రభాకర్. "ఈఅల్ల ర్లలో ఎప్పుడూ కూడ ఓ వందమందిని పట్టుకున్నారనుకోండి. అందులో ఏ ఇరవై మందో స్టూడెంట్సు వుంటారు. అంతే."

"అంటే?"

"ఏముందీ? మిగిలినవాళ్ళంతా కిరాయి తీసుకుని వస్తు న్నారు అల్లరి చేయటానికి. 'ఈ సమ్మెలూ, అల్లర్లూ ఎందుకు చేస్తున్నారు, ఏంకావాలిమీకు?' అనడిగితే ఒక్కడూ చెప్ప లేడు. ఎవ్వరికీ కారణం తెలియదు. ఎవ్వరో చెయ్యమంటు న్నారు. చేసినందుకు రోజుకింత - లేదా ఫలాని పనిచేసినందు కింత - ఇలా కూలిపని వర్గైరా వాటికి ఒక నిర్ణీతమైన రేటు వున్నట్టే ఈ అల్లర్లుచేసే వాళ్ళకికూడా బస్సు తగలబడితే ఇంత, సినిమాహాళ్ళూ, బజార్లో షాపులూ ధ్వంసంచేస్తే యింత, రైళ్లుఆపి అల్లర్లుచేస్తే యింత - అంటూ దక్కు తోంది, అని శుభ్రంగా చెప్తున్నారు. అందువల్ల ఇటువంటి సాధారణజనం ప్రశాంతిని కోరేబదులు అల్లర్లే కోరుకుంటు న్నారు- ఆ సందులో శుభ్రంగా కష్టపడకుండా తిందామని!"

"ఇంతకీ నేను చెప్పేదేమంటే మిస్టర్ మూర్తీ... మొన్న ఏదో బస్సును ఆపీ తగలబెట్టిన మూకలో మీ నాయర్ కూడా వున్నాడు. 'నా వంటమనిషి అదీఇదీ' అంటూ నువ్వేం వెనకేసుకురాకు, ఇప్పటికే ఇంటిచుట్టూ తిరిగే రకరకాల పెద్ద మనుషులతో వేగలేక ఛస్తున్నారు.

"ఇదన్నమాట మన నాయర్‌గాడు మానేసిన కార ణం!" ఆశ్చర్యంగా సుందరమూ కమలా ముఖముఖాలు

చూచుకున్నారు.

"ఎలా మారిపోయింది కాలం!"

"ఏం రోజులు చూస్తున్నాం!"

"ఊరికే అక్కడ నుంచునివుంటే నలుగురితో పాటు పట్టుకున్నారా, నిజంగా వాడేమైనా అల్లరి చేయటం కళ్లారా చూశారా మీరు?" సందేహం తీరని మూర్తి అడిగాడు. "బొత్తిగా అంతటి గూండా పనులు చేస్తాడంటారా?"

గంభీరంగా నవ్వాడు ప్రభాకర్. "ఏం, నీ వంటి మనిషి గనుక వాడు చాలా గొప్పవాడూ, ఏమీ తెలియని వాడూ అనుకుంటున్నావా? వాడినీ, వాడితో పాటు పట్టుబడ్డ మరో పదిమందినీ నాలుగు లాఠీదెబ్బలు తగిలించేసరికి రహస్యాలన్నీ చెప్పకొచ్చారు."

"ఏమిటవి?" కుతూహలమైన ప్రశ్నలు కురిశాయి.

"ఏమిటా?" తాపీగా చెప్ప నారంభించాడు. "వాడు చెప్పిన వివరాలను బట్టి కొందరు స్టూడెంటు లీడర్స్నీ, కొందరు పెద్ద మనుషులు - అంటే ఘరానా వ్యక్తులచుట్టూ తిరుగుతూ వాళ్ళకంటె గొప్పగా, బిజీగా వున్నట్టు నటిస్తారే - వాళ్ళు చేసే ఉద్యోగ మేమిటో తెలియదు కానీ మహా గొప్ప కబుర్లు చెప్తారు - చాలా మంచిమంచి బట్టలు వేస్తూ కార్లలో తిరుగుతూంటారు - అటువంటి వ్యక్తు లందర్నీ చుట్టబెట్టి తీసుకొచ్చాం - ఇహ చూసుకోండి ఎందరు పెద్ద మనుష్యులు మా ఇళ్ళచుట్టూ తిరుగుతూ మాకు ఎంతెంత ఆశలు చూపుతున్నారో- మీ ఇంటి ప్రక్క రామన్ కూడా వున్నాడు వాళ్ళల్లో!"

"ఆశ్చర్యం!" కమల అన్నది. "ఔను మరి! పొట్ట కూటికి లేనివాళ్ళకి ఒక్కసారి కార్లూ, మేడలూ వెలుస్తున్నాయంటే ఇలాంటి అడ్డదార్లే వుండాలి మరి! ఎంతెంత ఉద్యోగాలు చేసినా మాలాంటి వాళ్ళం ఎక్కడి గొంగళి అక్కడేగా వుంటాం మరి!"

"నిజం అంతే మరి." మూర్తి అన్నాడు. "ఇంతకీ రామన్ చేసే పనేమిటి?" అనడిగాడు ప్రభాకర్ని.

"ఏముంది? పైకి మాత్రమే స్టూడెంటు. నిజానికి చదువుల కోసం కాదు వీళ్ళు చేరేది స్కూళ్ళల్లో, కాలేజీల్లో. ఇటువంటి వాళ్ళని కొందర్ని చూసి పాపం స్టూడెంట్సు అందర్నీ చెడ్డగా విమర్శిస్తున్నారు కొందరు. ఈ రామన్ వంటి వాళ్ళు మీ నాయర్ లాంటి జనాన్ని పోగుచేస్తారు అల్లర్ల కోసం. ఇలా పోగుజేసినందుకు వాళ్ళకు ఒక్కో వర్గపు పెద్ద మనిషికి చాలా ముడ్తుంది. ఈ అల్లరి అంతా ఏ పాపం ఎరుగని స్టూడెంట్సు మీదకు నెట్టివేయబడ్తుంది......అటు కాలేజీలు పనిచేయక వాళ్ళకు చదువులూ లేవు; తీరుబడిగా ఇళ్ళ దగ్గఱ కూర్చుని కొందరు నిజంగా చెడిపోతున్నారు. పైగా స్టూడెంట్సందరికీ మూక ఉమ్మడిగా చెడ్డపేరు తగిలిస్తున్నారు, ఈ లోగుట్టు అంతా తెలియని ప్రజ!"

అంతలో టెలిఫోను మ్రోగింది.

"హుఁ కబుర్లలో పడ్డాం. ఇంకా మన భోజనాలు సగం కూడా కాలేదు." అంటూ మూర్తి వెళ్ళాడు టెలిఫోను రిసీవ్ చేసుకోవటానికి.

"ఆఁ ఆఁ ప్రభాకర్ గారు ఇక్కడే వున్నారు ... ఓ

క్షణం ఆగండి.” ...... “మహానుభావా! ఏ ఎస్పీగారి కోసం గాలిస్తున్నారట. మీ నౌకరు ఇప్పటికి నాలుగు కాల్సు చేశాడట, నాలుగిళ్ళకి.”

“ఏముందీ? ఎక్కడో కొంపలు తగులడ్తున్నాయేమో” విసుక్కుంటూ లేచి వెళ్ళాడు ప్రభాకర్.

ప్రభాకర్ భార్య ముఖం అప్పటికప్పుడు కళ తగ్గిపోయింది. “మళ్ళీ ఎక్కడెవళ్ళు కొట్టుకొంటున్నారో, అల్లర్లు చేస్తున్నారో భగవంతుడా! ఈ గొడవలలో ఈయన బయటికెళ్తే, వచ్చేవరకూ నిద్రాహారాలు లేకుండా జపం చేస్తున్నాను.” దిగులుగా అంటూన్న ఆమెను అంతా సానుభూతిగా చూచారు.

ప్రభాకర్ ఫోను యథాస్థానంలో వుంచేసి వచ్చి హడావుడిగా చేతులు కడిగేసుకున్నాడు.

“సారీ! నాకు అర్జెంటు పని తగిలింది. భోజనాల మధ్యలోనే వెళ్ళిపోతున్నాను. సారీ మిసెస్ మూర్తీ.” అంటూనే కోటు వేసేసుకుని వడివడిగా వెళ్ళిపోతున్నాడు.

“ఎక్కడికీ?” ప్రభాకరు భార్య ఆదుర్దాగా లేచింది.

“ఊర్వశీ థియేటరులో ఏవో అల్లర్లు జరుగుతున్నాయట. నిన్నెవరైనా ఇంటిదగ్గఱ డ్రాప్ చేసేస్తారులే.”

మెరుపులా మాయమయ్యాడు ప్రభాకర్.

“దిక్కుమాలిన ద్యూటీ అయిపోయింది. నెత్తిన చేతులుంచుకున్న శ్రీమతి ప్రభాకర్. కన్నీళ్ళొక్కటే తరవాయిగా వుంది ఆమె ముఖం.

“ఏమిటదీ, ఊర్వశిలోనా?” చేతిలోనున్న గిన్నెను

జారవిడచి వెఱ్ఱిదానిలా చూస్తూండిపోయింది కమ.

"ఏం, నీకేం?" భార్య విపరీత వాలకానికి విస్మయంగా చూచాడు మూర్తి.

"బాబు... శ్రీనివాస్......" మాట పూర్తి చేయలేదు కానీ ఆమె కళ్ళనుండి నీళ్లు కారిపోతున్నాయి.

"ఏమిటి బాబుకి? అసలీ లోకంలో వున్నావా?" ఆమెను పట్టి కుదుపుతూ అడిగాడు మూర్తి.

"ఏమిటి మిసెస్ మూర్తీ? ఏమైంది మీకు హఠాత్తుగా?" అతిథు లందరూ కూడ భోజనాల దగ్గఱనుండి లేచి పోయారు.

"హిస్టీరియా ఏమైనా వుందా?" ఒకరి ప్రశ్న.

"లేదు లేదు." అంటూనే మూర్తి మఱలా అడిగాడు. "చెప్పు కమలా కంగారు పడకు, ఏమిటి?"

"బాబు... ఏదో పిల్లల సినిమా వుందని ఊర్వశికే వెళ్లాడు!" ఆఖరికి చెప్పగలిగింది. "ఏమైందో ఏమిటో!" మఱలా ఏడ్వసాగింది.

"ఖంగారు పడకండి. మేమంతా లేమూ?" ఇప్పుడే వెళ్తున్నాం" అతిథులలో ఒకరిద్దరు అంటున్నారు.

అప్పటికే బయట మూర్తి జీప్ స్టార్టు చేసిన శబ్దం అందరికీ విన్పించింది.

మూర్తి ముఖం రౌద్రంగా వుంది. "చాల్లే పిల్లిని చంకబెట్టుకెళ్లినట్టు నువ్వుకూడా ఎందుకూ గొడవల్లోనికి? ఈ చేసిన నిర్వాకం చాలు." జీప్ శరవేగంతో పరుగెత్తింది.

"ఖంగారు పడకండి. నేను అక్కడికే వెళ్తున్నాను."

అంటూ ఇంజనీర్ రావ్ తన జీప్ స్టార్ట్ చేస్తున్నాడు.

"బాబు కేమీ కాలేదు కదా!" బేలగా కన్నీళ్ళతో అడుగుతూన్న ఆమెను చూస్తే అతడి కెంతైనా జాలి కలిగింది.

"ఏమీ కాదు, రండి. నేను తీసుకెళ్తాను. ఏడ్వకండి. ఏడిస్తే అందరికీ గాబరా తప్ప ప్రయోజనం వుండదు."

కన్నీళ్ళు తుడుచుకుంటూ ఎక్కింది జీప్ లోనికి కమల.

"ఊళ్లో హర్తాళ్ అవీ జరిగి నాలుగు రోజులైనా కాలేదు. ఎప్పుడే అల్లరి తలెత్తుతుందో తెలియదు. ఇటువంటి అస్థిరంగా వున్న సమయంలో మీరు బాబును పంపవలసిందికాదు." మిసెస్ రావు అన్నది.

"అంతా వెళ్తున్నారు క్లాసుపిల్లలని మారాంచేశాడు. వాళ్ళ టీచర్సు కూడా వెంట వుంటారు కదా, గొడవలు తగ్గిపోయాయనుకున్నాను కానీ... ఇలాగౌతుం దనుకున్నానా?"

"అదీ నిజమే. అడుగడుగునా శంకించుతూ ఇంట్లో కూర్చోబెట్టడమూ కష్టమే."

అతి గంభీరంగా వున్న కమల ముఖం చూచి మరి ఎవరూ మాట్లాడలేదు.

అతి వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు రావు.

"జాగ్రత్త, మరీ స్పీడు పెంచకండి," భార్య హెచ్చరించింది.

"మూర్తి ఇంకా స్పీడుగా వెళ్ళివుంటాడు. ఎక్కడా అతడి జీపు కనుచూపుమేరలో లేదు." అన్నాడు రావు.

"భగవంతుడా! ఈ నాడు ఏమి జరగనున్నదో! నా ముఖాన ఏమి రాసిపెట్టావో కదా!" అనుకోసాగింది కమల మాటిమాటికీ.

పదిహేను నిమిషాలలో సినిమా గేటుముందు ఆగింది జీప్.

భయంగా, ఆత్రంగా పరుగెట్టే చూపులతో చుట్టూ చూస్తూన్న కమలనుదుటిపై బలంగాతగిలింది ఓరాయివచ్చి.

"అమ్మా!" ఆక్రందన చేసిన కమలను పట్టుకున్నది మిసెస్ రావు. టపటపా శబ్దాలు, కేకలూ, ఏమిటో గందరగోళంగా వినవస్తున్నాయి.

"నాకేం ఫర్వాలేదు" అంటూనే లోపలికి పరుగు తీసింది కమల, నుదుటిని చేతితో ఒత్తుకుంటూ.

లోపల ఆ దృశ్యం!

థియేటర్ మీద రాళ్ళ వర్షం కురుస్తోంది. కిటికీల షోకేస్‌ల అద్దాలు, కార్లు, జీప్‌ల అద్దాలు పగుల్తున్నాయి.

అయితే, అక్కడున్నది గూండాలుకాదు! ఆ విపరీత కార్యాలు చేస్తూన్నది యువకులూ, పెద్దవాళ్ళూ కాదు, చిన్నచిన్న పిల్లలూ, ముక్కుపచ్చలారని పసివాళ్ళూ! నాలుగేళ్ళ వాడి నుండీ పదేళ్ళవాడి వరకూ వుంటారు అంతే.

థియేటరు మానేజర్; గుమాస్తాలు, ఆహ్వానింపబడిన పోలీసులూ, స్కూలు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులూ అందరూ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు ఆ బాలవీరులను శాంతపర్చటానికి.

కమలా, మిసెస్ రావూ ఒక మూల చెట్టుకింద నక్కి

నిలబడ్డారు: "ఏమిటే, పిల్లలిలా పేట్రేగిపోయారు?"

వారి ప్రశ్నకు సమాధానం ఓ పావుగంట తర్వాత అటుగా వచ్చిన ఒక పోలీస్ కానిస్టేబుల్ చెప్పాడు: "సినిమా సగం అయిన తర్వాత కరెంటు పోయింది, పూర్తిగా చూడ లేక పోయామన్న నిరుత్సాహంతో పిల్లలిలా రెచ్చిపోయారు. ఈరోజు మూడు స్కూల్సు నుంచి విద్యార్థులు వచ్చారు సినిమా చూడటానికి, ప్రత్యేకం పిల్లల షో!"

"కలికాలం!" మిసెస్ రావు అన్నది

ఆత్రంగా ఆమూల నిలబడే శ్రీనుకోసం గాలిస్తూన్న కమల అన్వేషణ వృథాపోలేదు.

"అడుగో, అడుగో, ఆ గోధుమరంగు సిల్కు బట్టలు-బాబు కదూ?" ఆత్రంగా పరుగుతీస్తూన్న ఆమెను వలదని పట్టుకుని వారిస్తూ అటుచూచింది మిసెస్ రావు.

వందలాది పిల్లలు! అందరూ వీరులు లాగే ప్రవ ర్తిస్తున్నారు.

"మాకు సినిమా కావాలి. సినిమా చూపండి?" అనే అరుపులు, రాళ్ళు, మట్టీ విసరటం. అందరికీ ఎదురుగా లీడర్సులా నుంచున్న నలుగురిలో శ్రీనూకూడా ఒకడు!

"అరుగో మూర్తిగారు అటుగా వస్తున్నారు. బాబు వేపే వెళ్తున్నారు లెండి, మనం వెళ్ళక్కరలేదు!" మిసెస్ రావు అంటోంది.

"హమ్మయ్య! నా బాబు కేమీ అవ్వలేదు సురక్షి తంగా వున్నాడు." అని అనుకోలేక పోయింది కమల మనసు. "శారీరకంగా అయితే, బాగానే వున్నాడు. కాని వాడి

మానసిక ఆరోగ్యం ఎంతగా చెడిపోయింది! స్కూలు బంద్ అయితే, ఇంటికి రాలేక, పలకా పుస్తకాలూ పోగొట్టుకుని ఏడ్చిన నెల్లాళ్ళ నాటి అమాయక శ్రీనూకూ వీడికీ ఎంత తేడా! ఎక్కడుంది ఈ జబ్బుకు కారణం?"

ఆ చిన్న చిన్న వాళ్ళను ఏమిచేయటానికీ లేక బ్రతిమి లాడుతున్నారు పోలీసులు.

మెల్లగా శాంతపడుతున్నది పరిస్థితి.

అయిదు నిమిషాలకు రావు వచ్చాడు నవ్వుతూ.

"రండి. బాబు క్షేమంగా వున్నాడు. మూర్తి జీపు దగ్గరకు తీసుకెళ్లాడు" అన్నాడు నవ్వుతూ కమలతో.

"చూస్తూనే వున్నాను." నీరసంగా వచ్చింది కమల స్వరం.

"ఏమలా వున్నారు? బాబు బాగున్నాడండీ!" రావు రెట్టించాడు. అందరికీ నాయకుడులా నిలబడి ఎలా రాళ్ళు విసిరి అల్లరి చేశాడో, అల్లరి వద్దని నచ్చిచెప్పుతూ చేతులు పట్టుకున్న పోలీసుతో తన నాలుగేళ్ళ కుమారుడు ఎలా పెనగులాడి ప్రతిఘటించాడో, తర్వాత మూర్తిని చూచి అతడిచేత రెండు చెంపదెబ్బలు తిని చల్లబడ్డాడో కళ్ళారా చూచిన ఆ తల్లి కంఠం నీరసంగా కాక ఉత్సాహంగా ఎలా పలక గలదు?

మౌనంగా రోదిస్తూన్న మనసుతో, సిగ్గుతో వాలి పోయిన తలతో జీపు దగ్గరకు వచ్చిన కమలను చూస్తూ. తాను చేతులతో ఎత్తుకు తీసుకువచ్చిన శ్రీనును క్రింద నిల బెట్టి, "ఇదుగో నీ కొడుకు, హీరో అయిపోయాడు.

క్షేమంగా వున్నాడు" అన్నాడు మూర్తి. కోపం, హేళన, బాధ మిళితమై పలికాయి అతడి కంఠంలో.

కమల శ్రీనుదెస నిస్తేజంగా చూస్తూ వుండిపోయింది.

"ఏరా! హీరో వైపోయావా? నా కొడుకు ఎంతగొప్ప వాడయ్యాడు నాలుగేళ్ళకే?" పట్టరాని కోపంతో శ్రీనును ఆ చెంపా ఈ చెంపా వాయించుతూంటే రావు అడ్డుకున్నాడు.

"వాడు పసివాడు మూర్తీ! రోజు లలా వున్నాయి. అంతే. ఎందుకు వాడిని కొట్టుకోవడం? దెబ్బతిన్నా యిది అర్థమయ్యే వయస్సు కాదు."

దారిలో కోపంగా అన్నాడు మూర్తి; "ఇటువంటి రోజుల్లో ఇంత చిన్న పిల్లవాడి నెవరైనా సినిమాలూ, నాటకాలూ అంటూ పంపిస్తారా? ఇవాళ వాడు సినిమా చూడనంత మాత్రాన ఏమిటి లోటు వచ్చిందటా?"

కమల ఏమీ ప్రత్యుత్తర మీయలేదు.

ఆ క్షణాని కాక్షణం మూర్తి కోపం అధికమౌతోన్నదే కాని తరగటం లేదు. "ఇవాళ ఇంతలో అయిపోయింది. వాడు మనకు దక్కాడు. ఇంకా ఏమైనా విపరీతాలు జరిగితే ఫలితమెలా వుండేది? అసలేమైనా ఆలోచించావా వాడిని పంపించేముందు? నలుగురైదుగురు పిల్లలకి రక్తాలు కూడా కారుతున్నాయి రాళ్లుతగిలి."

"చాల్లెండి, ఎలాగైనా మాట్లాడగలరు మీరు." ఇక మౌనంగా మిన్నకుండలేని కమల ఉక్రోశంతో అన్నది. "ఇలాగైంది గనుక నే మీరు నన్నింతగా సాధిస్తున్నారు. లేక

పోతే ఏమందురు? వాడిని మగవాడినిగా పెంచూ, మనిషిగా పెంచూ, ధైర్యవంతుడిని చెయ్యి...... అంటూ ఉపన్యాస మిస్తారే— అ కబుర్లేమయ్యాయ యిప్పుడు?"

మూర్తి సమాధానం చెప్పలేక పోయాడు. అతడి కోపమూ తగ్గలేదు. అప్పటికి ఆమె నొసట తగిలిన దెబ్బా, రక్తమూ చూచాడతడు. ఇల్లు జేరాక కమల రావును అడిగింది. "మీరే చెప్పండి అన్నగారూ, వాడి ఎదరే 'అట్లా కాదు ఇట్లా పెంచాలి' అంటూ ఎన్నో లెక్చర్లు ఇస్తారు. అవన్నీ విని వాడేమో— ఇవాళ నేను సినిమా వద్దనే సరికి 'డాడీ అయితే పంపించేవారు, నువ్వు పంపటం లేదు' అని రాగాలు పెట్టాడు, ఓ ప్రక్క ఇంట్లో పనివాళ్లు లేరు, మీ కందరికీ డిన్నర్ ఏర్పాట్లలో నేను తల మునకలౌతుంటే వీడి ఏడుపు ఒకటి, సరే అందరుపిల్లలూ వెళుతున్నారుగదా, అడుగడుగునా భయపడ్తూ నేను వీడిని ఇంట కూర్చోబెట్టటం దేని కనుకొంటూ పంపాను. మీరే చెప్పండి, నా తప్పే మైనా వుందా ?"

రావు తల పంకించాడు. "నిజమే. ఎవర్ననుకోవటానికీ లేదు."

## 4

ఆఫీసుకు వెళ్లబోతూ లోనికి వచ్చిన మూర్తి, కమల ఒళ్లో పడుకొనివున్న శ్రీనును చూచి కనుబొమలు చిట్లించాడు.

"ఏం ఒంట్లో బాగా లేదా వాడికి?"

"బాగానే వుంది." కమల సమాధానం.

"మరి? ఎదుకలా పడుకున్నాడు? స్కూలు లేదా?"

"ఉంది. నేనే పంపలేదు."

"అంటే?"

"ఏమీ లేదు. ఇన్నాళ్ళూ యింట్లో కూర్చున్నాడు. ఈరోజు కూడా కూర్చున్నందువల్ల వచ్చే పెద్ద నష్టమేమీ లేదు. ఈ చదువులు నిజంగా చదువులేనా? ఇవి వీళ్ళ భవిష్యత్తుకు రూపు దిద్దేవేనా?"

ఆమె అంతరంగంలో చెలరేగుతున్న సంఘర్షణను అర్థంచేసుకో గలిగాడు మూర్తి చూచాయగా.

"మరి ఏంచేద్దామని?"

"ఏమో, నాఆలోచనల అర్థమేమిటో, రూపమేమిటో నాకే సరిగా బోధపడటంలేదు...... మనం ఏమాశించి పిల్లల్ని స్కూళ్ళకి పంపుతున్నాం? వాళ్ళేం నేర్చుకొని ఎలా తయారై వస్తున్నారు?"

"శ్రీనూ ఇలా రా!"

తండ్రిని చూచి అసలే భయపడ్తూన్న శ్రీనివాస్ ఇప్పుడు మరింత బిగుసుకుపోయాడు.

"నిన్నేమీ చెయ్యను ఒక్కసారి ఇలా రా!"

శ్రీను బెదురుతూనే వచ్చాడు తండ్రి దగ్గరకు.

"నిన్న ఎందుకురా అలా రాళ్ళు విసిరావు సినిమాలో. ఎవరు చెప్పారు అలా చేయమని?"

శ్రీను గుడ్లు నిలబెట్టి చూడటమే కాని, ఏమీ మాట్లాడలేదు.

"నిజం చెప్పు, నిన్నేమీ అనను." మూర్తి మళ్ళీ అడిగాడు.

"మరీ... మరీ...... మనకేమైనా కావాలిస్తే అలా చెయ్యాలట కదూ?" మెల్లగా వున్న శ్రీను స్వరం కమల గుండెలలో బాణంలా తగిలింది.

"ఎవరు చెప్పారు అలా చెయ్యాలని?" మళ్ళీ అడిగాడు మూర్తి "ఏం కావాలి మీకు?"

"సినిమా, మరి మా సినిమా పూర్తిగా చూపకుండా మధ్యలో ఎందుకు ఆపేశారు వాళ్ళు? అందుకే రాళ్లు విసిరి అల్లరి చేశాం!"

కమలా, మూర్తీ నిస్సహాయంగా ఒకరి ముఖాలొకరు చూచుకోవటం మినహా వాడికి అర్థమయ్యేలా ఏమి చెప్పాలో నిర్ణయించుకోలేక పోయారు.

అంతలోనే సుడిగాలిలా వచ్చిపడింది పనిమనిషి.

"అమ్మగారూ! మీరే దిక్కు. మీరే రక్షించాల."

"ఏమిటే?" ఏదో అడగాలి గనుక అడిగిందే కాని కమల స్వరంలో సానుభూతి ఏమీ లేదు. "మహారాణిలా ఇంట్లో కూర్చున్నావ్ పనిమానేసి నిష్కారణంగా. ఇప్పుడు నా అవసరమేమి టొచ్చింది మళ్ళీ?"

"తల్లి, తల్లి. సచ్చిన పామును సంపకండమ్మా." కాళ్ళు పట్టుకొంది."

"ఏమిటసలు గొడవ?" మూర్తి అడిగాడు.

"బాబుగారూ! మీరే రచ్చించాల. ఆ శంకర్ గాడు సెడిపోతున్నాడు."

"పూర్తిగా చెప్పి ఏడువు."

"నాకేదో మంచిపని దొరికింది— ఇక నువ్వు కట్ట పడొద్దమ్మా అంటే బుద్ధి గడ్డితిని నమ్మాను అమ్మగారూ. పదిహేనూ ఇరవయ్యో పట్టుకొచ్చిండు ఈ పదేను రోజులున్నంచీ."

"ఇప్పుడేమైంది?"

"ఆ డబ్బు ఎలా తెచ్చిండో— ఆ సేసిన పని ఏంటో నాకు తెలీదమ్మగారూ. భగవంతుడు సాచ్చి, మొన్న ఈడి నేస్తాల నిద్దర్ని పోలీసులు పట్టుకుపోయిన్రట. అందుకని ఈడు అక్కడా, అక్కడా దాకుంటున్నడు. ఈడిని కూడా పట్టు కెళ్ళిపోతారు గాబోలు. నేనేటి సెయ్యగలను దేముడా, మీరే దిక్కు— అయ్యగారూ, పెద్ద పోలీసు బాబుతో మీకు దోస్తీ గద— కుసింత సెప్పి పుణ్యం గట్టుకోండి బాబూ."

"ఏడి, శంకర్ ఉన్నాడా ఇప్పుడింట్లో?"

"ఉన్నాడు బాబూ, ఇప్పుడే వచ్చిండు. మళ్ళీ ఇప్పుడే పోతాడట?"

"ఇలా పిలువు!"

బెదురుతూ బెదురుతూ వచ్చి నిలబడ్డాడు శంకర్ తల్లి వెనుక. భూమి కతుక్కుపోయాయి వాడి చూపులు. ఒక నాటి గర్వం, తిరస్కారం స్థానే ఈనాడు భయం, జేలతనం గూడుకట్టుకున్నాయి వాడి వదనంలో.

"ఏమిట్రా సంగతి?" మూర్తి అడిగాడు.

శంకర్‌లో చలనం లేదు.

"నిన్నేరా, ఇటు చూడు!" గదమాయించాడు మూర్తి.

వాడి తల్లి కలజేసుకుంది: "చెప్పరా ఎదవమొకమా ఏటో అసలుగొడవేంటో అయ్యగారికి దాసకుండాసెప్పెయ్యి మా రాజులాంటి బాబు, ఆరే రచ్చించాల."

"ఏమిట్రా శంకర్? అదేమిటో నాకు చెప్పు; నువ్వు నిజం చెప్తేకదా మేమేమన్నా చెయ్యగలిగేది? నాకు చెప్పు, అయ్యగారేమీ అనరులే," లాలనగా అడిగింది కమల. "చూడు మీ అమ్మ ఎలా ఏడుస్తోందో! నీకేమైనా అయితే దానికెవరు దిక్కు? పోలీసులు పట్టుకెళ్ళేంతటి ఘనకార్యాలు చేసేవాడవయ్యా వేమిటి?"

ఒక్కసారిగా భోరుమన్నాడు శంకర్! "నాకేం తెలియదమ్మగారూ, అస్సలు నాకేం తెలియదు, ఆళ్ళే పిలుసుకెళ్ళారు నన్ను."

"ఎవరు, ఎక్కడికి? ఏడవకుండా చెప్పు."

"సినిమాహాలు దగ్గర అవీ ఇవీ అమ్ముకుంటుండేవోడిని కదమ్మగారూ, ఈ అల్లర్లలో అన్నీ బంద్దైనాయి. ఆ రోజు గొడవల్లో నా సరుకులన్నీ అందరూ లాగేసుకున్నారు. మీకూ తెల్సు కదా?"

"అది సరే, ఆ తర్వాత? మీ అమ్మని పనెందుకు మాన్పించావ్ మా యింట్లో?"

శంకర్ తల్లి పురాణం విప్పింది పెద్ద గొంతుతో.

"రెండు మూడు రోజులు ఇంటికాడ కుదురుగానే వున్నా డమ్మగారూ, ఆడి జిమ్మడ— ఆ హోటేలు బాబు లేడూ..."

"నువ్వూరుకో, వాడిని చెప్పనీ." కసురుకున్నాడు మూర్తి.

శంకర్ చెప్పాడు బెదురుతూ, "అయ్యగారూ, నిజం చెప్తాడు. నాకేం జరగదు కదా?"

"ఏం జరగదు, నాదీ పూచీ."

"ఆ హోటలు బాబుగారి పనికుర్రాడు......"

"ఎవరు? మన ప్రక్కింటి వాళ్ళైనా?"

"ఊఁ."

"వాడితో నీకు దోస్తీ ఎప్పట్నుంచీ?"

"దోస్తీకాదు బాబుగారూ."

"మరి?"

"సాయంత్రం రిక్షాల్లో ఆ అయ్యగారూ, అమ్మగారూ సికారుకీ, క్లబ్బుకి ఎల్లిపోనాక ఆడికి పనుండదు."

"సర్లే అయ్యగార్లూ, అమ్మగార్లూ క్లబ్బులకెళ్ళి పోయాక, ఇక్కడ నౌకర్ల క్లబ్బు సమావేశమౌతుందన్న మాట!"

"నాకూ పనిలేదు. ఊసుపోక పేక, పులిజూదం ఆడు కుంటుండేవోలం, ఓనాడు ఆడిదగ్గర చాలా డబ్బుందయ్యా గారూ. నేనెప్పుడూ సూడలేదంత డబ్బు ఎక్కడిదనడిగితే— 'ఏం కష్టపడక్కర్లేదు. ఒక్క చిన్నపని సేస్తావా నీకూ ఇప్పి స్తాను ఇంత డబ్బు' అన్నాడండీ." ఆపుజేసి భయంగా చూడ సాగాడు.

"చెప్పు, పూర్తిగా చెప్పు."

"ఆ హోటలు బాబుగారి అబ్బాయిగారి దగ్గరకు తీసుకెళ్ళాడండి నన్ను."

"రామన్ దగ్గరకా."

"ఆఁ, ఆరిదగ్గర ఇంకా సాలామంది కుర్రోలున్నారండి. ఒక్కోరోజు ఒక్కోచోట రాళ్ళు ఏస్తే లేదా రైలు ఆపడం, స్టేషన్లూ, బస్సులూ తగలబెట్టడం ఇలాం సేస్తే - ఎంతెక్కువ పనిసేస్తె అంత డబ్బు ఇస్తానన్నారు."

"ఎక్కడ అల్లరి చెయ్యాల్లో నీకెవరు చెప్పేవారు?"

"ఆరి నౌకరే, రోజూ రాత్రి రెండుగంటలకి ఆరి హోటలు ఎనక ఖాళీస్థలంలో కల్సుకుండేవోలం. ఎప్పుడైనా రామన్ బాబు కూడా సెప్పేవోడు. చేసిన పనిని బట్టి డబ్బు ముడుతుండేది."

"ఎంత?"

"పదిహేను నుంచి యేభై అరవై వరకూ. ఏదైనా తగలబెట్టిన వోళ్ళకి, పోలీసులకి దెబ్బలు తగిలేట్లు రాళ్ళు ఇసిరి అల్లరి చేసినోళ్ళకీ ఎక్కువ డబ్బు ఇస్తారయ్యగారూ."

నీకు భయం వెయ్యలేదా ఈ పనులు చెయ్యటానికి? గుప్పెడు రూపాయలకోసం ఈపనిచేశావు. ఖర్మకాలిపోలీసులు కాల్చితే- ఛస్తే? నీ తల్లి గతేమిటి?"

"పోలీసులేం చెయ్యరనీ, అదంతా ఆరు చూసుకుంటామన్నారండీ, ఒకవేళ జైలులో పెట్టినా ఇడిపించే పూచీ ఆరిదే నన్నారు. ఇదంతా ఎవరికైనా చెప్తే కాళ్ళిరగ్గొడతామన్నారు."

"ఎంత సంపాదించావ్ మొత్తం?

"రెండొందలు."

"ఏంచేశావా డబ్బు? మీ అమ్మకిచ్చావా."

శంకర్ మాట్లాడలేదు.

వాడి తల్లి చెప్పింది. "బియ్యం, పప్పు, వుప్పు ఖర్చులకి బాగానే ఇచ్చాడు బాబుగారూ. మిగిలిన దానితో సిల్కు గుడ్డలు కొనుక్కున్నాడు. జల్సా చేసుకున్నాడు. నాకివ్వలేదు."

"మరి నాల్గురోజుల్నుంచీ ఈ అల్లర్లేం లేవుగా? ఎలా గడుస్తోంది?"

ఇద్దరూ తలలు వాల్చుకున్నారు.

"ఏది దాచినా లాభంలేదు. చెప్పవలసిందే."

మూర్తి కోపం చూచి జంకాడు శంకర్. "నిన్నటి దాక బియ్యం కొంచెం డబ్బూ ఆయమ్మగారు సర్దారు."

"ఎవరు? ఆ హోటల్ బాబుగారి భార్యా?"

"మరేనండి. ఇక మళ్లీ ఏదైనా అవసరమైతే పిలుస్తాం ఇప్పటి మట్టుకు పోయి ఏదైనా పని చేసుకోమన్నారు"

"అదీ సంగతి, అందుకు మేం జ్ఞాపకం వచ్చామన్న మాట." కోపంగా అన్నది కమల. "ముదహోరేళ్లైనా లేని లోకం తెలియని వెధవ, వాడికి బుద్ధి ఎటూ వుండదు ముసిల్దానివి, ఇన్నాళ్ళుగా మా యింటితిండి తింటున్న దానివి— నీకైనా బుద్ధిలేక పోయిందటే? నాల్గురోజుల మెరుపుకోసం ఇంత గడ్డితినిపించావా ఆ కుర్రవెధవని? ఏ పోలీసు కాల్పు

ల్లోనో ఛస్తాడు...... లేదా పెద్ద గూండాగా- రౌడీగా తయారై పోతాడు. అప్పుడు బ్రతుకంతా ఏడుస్తావ్? ఇలా దిగు దిగుమని దింపినవాళ్ళు నట్టేట్లో వదిలేస్తారు."

"ఏదో బుద్దితక్కువై పోయి గడ్డితిన్నాం అమ్మగారూ! బాగా బుద్ధివచ్చింది. మీరే రచ్చించాల." లెంపలు టప టపా వాయించేసుకుంది.

"ఏరా, బుద్ధి వచ్చిందా? కుదురుగా వుంటావా ఇక?"

మూర్తి ప్రశ్నకు అంగీకారంగా తలఊపాడు శంకర్.

"ఇక నీకు ఏపనీ వద్దు, ఆ పోలీసు బాబుగారింట్లోనే చెప్పినపని చేస్తూవుండు. నేను చెప్తానాయనతో. ఏమాత్రం మళ్ళీ నువ్వు పెడత్రోవలు పట్టినా— పోలీసుల అవసరంలేదు నేనే విరిచేస్తాను. రెండుకాళ్ళూ జాగ్రత్త. ఏం, సరిగా వుంటావా ?"

"ఉంటా నయ్యగారూ."

"వాడిదేముందీ?" కమల అందుకొంది. భయం బుద్ధీ చెప్పాల్సిన తల్లే గడ్డి తినిపిస్తే వాడేం చేస్తాడు? అడగాల్సింది దీనినీ." అంది శంకర్ తల్లి నిద్దేశించి.

"ఏం,. విన్నావా అమ్మగారిమాట? సరిగా ఇంట్లో పని చేసి వుంటే వుండు, లేదా ఆ ఇల్లు ఖాళీచెయ్యి, మరో నౌఖర్ని తెచ్చిపెట్టుకుంటాం."

"చేస్తానయ్యగారూ, ఈ సారికి క్షమించండి. కుఱ్ఱోడి కోదారి సూపండి."

"అదంతా నేను చూసుకుంటానులే. పోండి."

కనులు తుడుచుకుంటూ, మెల్ల మెల్లగా నిష్క్రమి స్తూన్న శంకర్ తల్లిని చూస్తూంటే కమల మనసులో ఎన్నో భావాలు మెదిలాయి.

"ఈ బిడ్డను ఏమిపెట్టి పెంచను, ఎలా చదువు చెప్పిం చను, ఎలా వైద్యం చేయించాలి?" అనే సాధారణ సమస్య లకు తోడుగా ఈనాడు ప్రతి తల్లీ ఎదుర్కొంటూన్న గడ్డు ప్రశ్న ; "నా బిడ్డను ఈ మహమ్మారికంటే భయంకరమైన అల్లర్ల అంటుజాడ్యం సోకకుండా ఎలాపెంచను? గూండాగా విప్లవకారిగా తయారుకాకుండా వుండాలంటే వీడిని ఎక్కడ దాచాలి ? అటువంటి ప్రశాంతమైన ప్రపంచాన్ని మళ్ళీ చూస్తామా ?"

ఆఫీసుకు వెళ్ళిపోతూ మూర్తి అన్నాడు ; "ఇంట్లో కూర్చొబెట్టి నందువల్ల పెద్దగా కలిగే ప్రయోజనమేమీ లేదు. అక్షరజ్ఞానం కూడా లేకుండా తయారౌతాడు, అంతే ...తయారుచెయ్యి త్వరగా, స్కూల్లోదింపి వెళ్ళిపోతాను."

మౌనంగా లేచింది కమల. శ్రీనుకు స్కూలు యూని ఫారం వేసి, పుస్తకాల పెట్టె యిచ్చి. "కుదురుగా వుండు. అల్లరి చేయకు. టీచరుచేత దెబ్బలు తినకు. శ్రద్ధగా పాఠం విను." అంటూ మరీ మరీ బుద్ధులు చెప్తూ సాగనంపింది.

అన్నిటికీ బుద్ధిగా తల వూపుతూన్న వాడిని చూచి హేళనగా నవ్వుతూ, భార్యతో అన్నాడు మూర్తి! "ఎం దుకా కంఠశోష? అక్కడ మందలో చేరగానే మనమూ మన పాఠాలూ గుర్తుకురావు వాడికి."

సాగిపోయిన జీప్ నే చూస్తూ నిలబడింది కమల.

వీధివెంట పోతూన్న నలుగురు విద్యార్థులు సరదాగా వీధిలో ఎలెక్ట్రిక్ స్తంభాల బల్బులకు సూటి చూసి రాళ్ళు విసుర్తున్నారు.

ఒక్కొక్క బల్బూ 'ఢాం' మనే వరకూ వదలిపెట్ట కుండా రాళ్ళు విసిరి, తమ ప్రజ్ఞకు తామే మురిసిపోతున్నారు. వాళ్ళు విసరిన రాళ్ళలో ఒకటి దారినపోయే ఒక బిచ్చగాని పై పడింది. రాయి తగిలిన బాధ సాధారణమేమీ కాదు. అందుకే ఆ బిచ్చగాడు బాధలో ఏమో అన్నాడు. విద్యార్థులు పౌరుషపడి తిట్టారు. బిచ్చగాడు రెట్టించాడు. ఈసారి విద్యార్థులలో ఒకడు ఒక పెద్దరాయితీసి ముష్టివాడి కాలుపై కొట్టాడు. వాడు ఆక్రందన చేస్తూంటే సంతృప్తిగా నవ్వు కొంటూ పారిపోయారు.

ఆ మహావీరులను 'అదే'మని అడగగల దమ్ము ఎవ్వరికీ లేదు. చీటికీ మాటికీ హక్కులూ, అధికారాలూ అంటూ ఆర్భాటాలు చేసే ఆ యువకులకు ఒక నిస్సహాయుడైన వ్యక్తిని దయగా చూడటం కానీ, కనీస మానవతను ప్రదర్శించటం కానీ తెలియదు. ప్రగతి ఎటువైపు పయనిస్తూన్నది ?

పది నిమిషాలలో జీప్ తిరిగి వచ్చింది. మూర్తితో పాటు దిగి వస్తూన్న శ్రీనును చూచి ఆశ్చర్యపడింది కమల.

"ఏం, స్కూలు లేదూ?"

"లేదు, ఎప్పుడు ఎన్నాళ్ళ తర్వాత వుంటుందో కూడా చెప్పలేం." మూర్తి సమాధానం, "ఎక్కడో పోలీసుకాల్పులలో ఎవరో స్టూడెంటు చనిపోయాడట. అంచేత ఆందోళన

ఆ వెనుక అల్లరీ. ఒక స్కూల్లో టీచర్లని స్టూడెంట్సు కొట్టారట. అందువల్ల నిరసనగా ఉపాధ్యాయులంతా కూడా సమ్మె చేస్తున్నారు! హాయిగా ఇంట్లో కూర్చోబెట్టుకో పిల్లవాడిని."

దిగ్భ్రమతో చూడసాగింది కమల.

"సరే. నేను వెళ్తున్నాను ఆఫీసుకు."

"మీ ఆఫీసులు పనిచేస్తాయా మరి?"

"ఏమో? ఇక్కడనుంచి ఆఫీసుకుజేరే గంటకాలంలోగా ఎక్కడేమైనా జరగవచ్చు. ఫలితంగా అష్టదిగ్బంధన జరగవచ్చు. ఎవరేం చెప్పగలరు? ఆఫీసుకు జేరగలనో లేదో- అక్కడ పని చెయ్యాలో లేదో- చూస్తాను ఇప్పుడు పోయి. క్షేమంగా వుంటే సాయంత్రం తిరిగివస్తాను...బై బై..."

'ఆహా! ఎటు పయనిస్తున్నాం మనం? మన ఆత్మ సంస్కారం, ఔన్నత్యాం పురోగమించుతున్నాయా లేక తిరోగమించుతున్నాయా? ఆనాటి కానాడు రక్షణా, భద్రతా కొంపడుతూన్న ఈ సమాజ స్థితి ఎలా బాగుపడ్తుంది?'

కథా నిలయం
5424
శ్రీకాకుళం
3-613